



అనకాపల్లిలో కొనుగోలుదారులతో రద్దీగా వున్న ఓ ప్రైవేటు మద్యం దుకాణం

భారీ వర్షాల హెచ్చరికలతో అన్నదాతల్లో గుబులు

వాయు గండం!

- పొట్ట, వెన్ను దశల్లో ఉన్న వరి పైరు
- ఆందోళన చెందుతున్న రైతులు
- కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్
- అందుబాటులో ఫోన్ నంబరు 08924-222888
- అధికారులు మండల కేంద్రాల్లోనే ఉండాలని కలెక్టర్ ఆదేశాలు



చోడవరం మండలంలో ఏపుగా పెరిగిన వరి పైరు

అనకాపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో నెలకొన్న వాయుగుండం ప్రభావంతో జిల్లాలో వాతావరణం మారిపోయింది. బుధవారం పలు మండలాల్లో ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసింది. మిగిలినచోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి. సాయంత్రం తరువాత ముసురు వాతావరణం నెలకొంది. వాయుగుండం కారణంగా గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందన్న వాతావరణ శాఖ సమాచారంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందస్తుగా.. అంటే జూలై చివరివారంలో వరినాట్లు వేసిన పొలాల్లో ప్రస్తుతం వరిపైరు పొట్ట, వెన్ను దశల్లో వుంది. ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాల్లో మరికొద్ది రోజుల్లో పొట్టకొస్తుంది. రైతులు దుక్కిదున్నడం నుంచి విత్తనాలు, నారుమడి, దమ్ము, నాట్లు, ఎరువులు, కలుపుతీత, పురుగు మందుల కోసం ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేశారు. వ్యవసాయ శాఖ అధికారుల గణాంకాల ప్రకారం ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 56 వేల హెక్టార్లలో వరి సాగు అవుతున్నది. కాగా గత నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు సుమారు 660 ఎకరాల వరి పంట నీట మునగడంతో 2,846 మంది రైతులు నష్టపోయారు. తరువాత వాతావరణం అనుకూలంగా వుండడంతో ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో వరిపైరు ఆశాజనకంగా వుంది. ఇటువంటి పరిస్థితుల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశాలు వున్నాయని, తుఫాన్‌గా మారే ప్రమాదం వుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వరితోపాటు అపరాలు, చిరుధాన్యాలు, కూరగాయ పంటలను సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, ఫోన్ నంబరు 08924-222888 అందుబాటులో ఉంచారు. అధిక వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురైతే తక్షణమే సహాయ చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసినట్టు డీఆర్‌ఓ దయానిధి తెలిపారు. విపత్కర పరిస్థితులను అధిగమించడానికి రెవెన్యూ అధికారులు మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు.

ప్రైవేటు మద్యం అమ్మకాలు ప్రారంభం

- హడావిడిగా షాపులు ఏర్పాటు చేసిన వ్యాపారులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. రెండు రోజుల క్రితం లాటరీలో మద్యం దుకాణాల లైసెన్సులను దక్కించుకున్న వ్యాపారులు.. హడావిడిగా లీజుకు షాపులు తీసుకుని విక్రయాలను ప్రారంభించారు. మద్యం షాపులు కావడంతో సాధారణ అద్దెలతో పోలిస్తే రెట్టింపు చెల్లించాల్సి వచ్చిందని, అడ్వాన్స్‌లు కూడా భారీగా ఇచ్చినట్టు ఓ మద్యం ... మిగతా 8వ పేజీలో

అధిక ధరలకు మద్యం అమ్మకాలు

- దుకాణాన్ని మూసివేయించిన మందుబాబులు

మాకవరపాలెం, అక్టోబరు 16: గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ) కంటే ఎక్కువ రేటుకు మద్యం అమ్ముతుండడంతో మందుబాబులు కన్నెర్ర చేశారు. షాపు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగి, దుకాణాన్ని మూయించివేశారు. మాకవరపాలెంలో బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి. నూతన మద్యం పాలసీలో భాగంగా లాటరీలో మద్యం అమ్మకాల లైసెన్సు పొందిన వ్యాపారులు బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ఇక్కడ మద్యం షాపు తెరిచారు. అప్పటికే మందుబాబులు పెద్ద సంఖ్యలో అక్కడ వేచివున్నారు. అయితే మద్యాన్ని ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు అమ్ముతుండడంతో షాపు యాజమానులను మందుబాబులు నిలదీశారు. దీంతో ఉభయుల మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేశారు. ఎక్కువ ధరకు ఎలా అమ్ముతారంటూ మందుబాబులు గట్టిగా ప్రశ్నించడంతో చేసేది లేక మద్యం షాపును మూసివేయించారు.



మాకవరపాలెంలో మూసివేసిన మద్యం షాపు

గ్రామీణ రహదారులకు మహర్దశ

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాల్లో పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ వెల్లడి



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పక్కన సీఈవో

- రూ.245 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- విశాఖ జిల్లాలో రూ.20 కోట్లతో 149 పనులు
- అనకాపల్లి జిల్లాలో రూ.83.51 కోట్లతో 943...
- పాడేరు డివిజన్‌లో రూ.142 కోట్లతో 176...
- డిసెంబరులోగా పూర్తికి ఆదేశాలు
- ఇతర రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరిన జడ్పీ సీఈవో
- ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలన్న చైర్‌పర్సన్
- కోరం లేక నాలుగో స్థాయీ సంఘ సమావేశం వాయిదా

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.245 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లోని 1,268 రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన బుధవారం జరిగిన 1,7 స్థాయీ సంఘ సమావేశాల్లో పలు ఇంజనీరింగ్ విభాగాల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ రోడ్లపై చర్చకు ఎస్ఈ బదులిస్తూ విశాఖ జిల్లాలో రూ.20 కోట్లతో 149 పనులు, అనకాపల్లి జిల్లాలో రూ.83.51 కోట్లతో 943 పనులు మంజూరయ్యాయన్నారు. అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో రూ.142 కోట్లతో 176 పనులు ఇంతకుముందే మంజూరు చేశారన్నారు. ఈ పనులు డిసెంబరు నెలాఖరులోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. గతంలో చిన్నపాటి మరమ్మతులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ పనులు రద్దు చేయడం జరిగిందన్నారు. జడ్పీ సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ మండల, జడ్పీ రోడ్ల మరమ్మతులకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మండల స్థాయిలో రోడ్లను ఉపాధి నిధుల నుంచి చేపట్టవచ్చునని, జడ్పీ రోడ్లకు జడ్పీ నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ దశలో చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ చిన్నపాటి మరమ్మతులు చేయడం వల్ల ఉపయోగం లేదని, శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పనులు వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు తానాం రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు. తొలుత రెండో స్థాయీ ... మిగతా 8వ పేజీలో

24న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న పలు సమస్యలపై చర్చిస్తారని అధికారులు తెలిపారు.

చోడవరంలో కమ్యూనిటీ ఫ్రిజ్



స్వయంభూ విఘ్నేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ఫ్రిజ్

- పేదల ఆకలి తీర్చేందుకు ఆపన్నహస్తం

చోడవరం, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): సంచార జీవులైన అనాథల ఆకలి తీర్చడానికి ఆహారపదార్థాలు అందుబాటులో వుంచేందుకు పట్టణంలోని సద్భావన టీమ్‌కు చెందిన యువకులు స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయం వద్ద కమ్యూనిటీ ఫ్రిజ్‌ను ఏర్పాటు చేశారు. రోడ్లపై తిరిగే సంచారజీవులు, ఆకలిగా ఉండి తినడానికి డబ్బులు లేని పేదలకు ఉపయోగపడాలన్న ఉద్దేశంతో దీనిని ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఎవరైనా తమ ఇంట్లో పుట్టిన రోజు, పెళ్లిళ్లు, ఇతర వేడుకల సందర్భంగా పేదలకు ఆహారం పెట్టాలన్న ఉద్దేశం వున్న వారు ఈ ఫ్రిజ్‌ను ఆహారపదార్థాలు వుంచొచ్చు. అదేవిధంగా శుభకార్యాల సందర్భంగా మిగిలిన ఆహార పదార్థాలను వృథాగా పడవేయకుండా పేదలకు ఉపయోగపడేలా ఇందులో పెట్టవచ్చు. విఘ్నేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ ఫ్రిజ్‌ను స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో కమ్యూనిటీ ఫ్రిజ్ ఏర్పాటు చేయడానికి ఆసక్తి వున్న వారికి ఫ్రిజ్‌లను సమకూరుస్తామని నిర్వాహకులు తెలిపారు.



కమ్యూనిటీ ఫ్రిజ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజు, నిర్వాహకులు

'ఇరిగేషన్'లో ఇష్టారాజ్యం

సమయపాలన పాటించని జలవనరుల శాఖ ఉద్యోగులు

- ఉదయం 11.30 గంటలైనా విధులకు హాజరుకాని సిబ్బంది
- తాండవ డీఈఈ, ఏఈఈలు విశాఖ నుంచి రాకపోకలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఇద్దరు సబార్డినేట్లు మాత్రమే ఉన్న జలవనరుల శాఖ కార్యాలయం

నర్సీపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ స్థానిక ఉప కార్యానిర్వహక ఇంజనీరు కార్యాలయంలో ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో అధికారితోపాటు సిబ్బంది కూడా వేళకు విధులకు హాజరు కావడం లేదని అంటున్నారు. దీంతో వివిధ పనులపై వస్తున్న రైతులు, కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. జలవనరుల శాఖ డీఈఈ కార్యాలయంలో బుధవారం ఉదయం 11.30 గంటలకు ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లు మాత్రమే ఉన్నారు. ఉప కార్యనిర్వహక ఇంజనీరు.. ఆఫీసు రూమ్‌లో లేరు. సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. తాండవ డీఈఈ కార్యాలయంలో కూడా అదే పరిస్థితి. ఇక్కడ జూనియర్ అసిస్టెంట్ ఒక్కరే ఆఫీసులో ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్ డివిజన్ కార్యాలయంలో ఉన్నట్టు చెప్పారు. తాండవ డీఈఈ, ఏఈఈలు విశాఖపట్నం నుంచి రోజూ రాకపోకలు చేస్తున్నారు. బుధవారం ఉదయం 11.48 గంటలకు కూడా వీరు కార్యాలయానికి రాలేదు. మరో ముగ్గురు ఏఈలు తమ తమ సెక్షన్‌లలో ఫీల్డ్‌లో ఉన్నట్టు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులు పెద్దగా కార్యాలయంలో ఉండేవారు కారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా పాత పద్ధతిలోనే విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

మరణంలోనూ వీడని స్నేహం

రోడ్డు ప్రమాదంలో మిత్రులు దుర్మరణం

- కశింకోట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదం
- స్వస్థలం నక్కపల్లి మండలం
- విశాఖ నుంచి బైక్‌పై వస్తుండగా ఘటన



బర్నికుల రాజేశ్(ఫైల్‌ఫొటో)



కురందాసు ప్రతాప్ (ఫైల్‌ఫొటో)

కశింకోట/ నక్కపల్లి (అనకాపల్లి జిల్లా), అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : వారిద్దరూ ప్రాణ స్నేహితులు. ఎక్కడకు వెళ్లినా ఇద్దరూ కలిసే వెళ్లేవారు. చివరకు మరణంలోనూ తమ స్నేహబంధం వీడదీయరానిదంటూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ ఒకేసారి మృత్యువాతపడ్డారు. నక్కపల్లి మండలం నెల్లిపూడి, ఉద్దండపురం గ్రామాలకు చెందిన వీరు జాతీయ రహదారిపై మండల కేంద్రమైన కశింకోట వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ సంఘటనకు సంబంధించి కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలిలా వున్నాయి.

నక్కపల్లి మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన బర్నికుల రాజేశ్ (24), గునిపూడికి చెందిన కురందాసు ప్రతాప్ (26) చిన్నప్పటి నుంచి స్నేహితులు. కురందాసు ప్రతాప్ ఉద్దండపురంలో నివాసం వుంటున్నాడు. విశాఖపట్నంలో కారు డ్రైవర్లుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. మంగళవారం రాత్రి విశాఖ నుంచి ద్విచక్రవాహనంపై నక్కపల్లి మండలానికి బయలుదేరారు. అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో కశింకోట వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొన్నది. ప్రతాప్, రాజేశ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు.

సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బుధవారం ఉదయం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నట్టు చెప్పారు. కాగా మృతిచెందిన యువకులిద్దరూ అవివాహితులే! చేతికి అందివచ్చిన బిడ్డలు రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

భూ సమస్యలకు పరిష్కారం!

- జిల్లాలో నేటి నుంచి రెవెన్యూ సదస్సులు
- రీసర్వే జరిగిన 455 గ్రామాల్లో సభలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. గత వైసీపీ ప్రభుత్వం భూముల రీసర్వే చేయించిన అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు జిల్లాలో గురువారం నుంచి 30 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారు. గత ప్రభుత్వ హయాంలో అనకాపల్లి జిల్లాలో 455 గ్రామాల్లో భూముల రీసర్వేను పూర్తి చేశారు. అయితే వైసీపీ నాయకులు ల్యాండ్ పూలింగ్, 22ఏ ఫ్రీహోల్డ్ పేరుతో పెద్దఎత్తున ప్రభుత్వ ప్రైవేటు భూములను తమ గుప్పెట్లో పెట్టుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో రీసర్వే పూర్తయిన 455 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం భావించింది. గతంలో జరిగిన రీసర్వే వల్ల నష్టపోయిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు జేసీ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటలకు ఒక గ్రామంలో, మధ్యాహ్నం 3 గంటలకు మరో గ్రామంలో సదస్సులు నిర్వహిస్తారు. గ్రామస్థాయి సదస్సుల్లో ఆర్ఐ, వీఆర్ఓ, సర్వేయర్లు, రిజిస్ట్రేషన్, అటవీ, దేవదాయ శాఖల ఉద్యోగులు, వక్ఫ్‌బోర్డు ప్రతినిధులు వుంటారు. మండలస్థాయిలో జరిగే సదస్సులకు ఆర్డీఓ, తహసీల్దారు వుంటారు. సదస్సులకు వెళ్లే అధికారులు తమతోపాటు గ్రామ చిత్రపటాలు, ఆర్ఓఆర్, 1బీ అడంగల్, పహానీ, ప్రభుత్వ భూమి (22ఏ రికార్డు), వెబ్‌ల్యాండ్‌లో భూముల వివరాల నకళ్లను తీసుకెళతారు. భూఆక్రమణలపై ఫిర్యాదులు, 22ఏ రికార్డుల్లో భూముల స్థితిగతులు, రీసర్వే, కొత్త పట్టాదారు పాసుపుస్తకాల జారీ, సరిహద్దు రాళ్ల ఏర్పాటు వంటి వాటికి సంబంధించి ఫిర్యాదులు స్వీకరిస్తారు. గ్రామ సభల్లో అందిన ఫిర్యాదులను ఆర్డీజీఎస్‌లో నమోదు చేసి విచారణ జరుపుతారు.



రెవెన్యూ సదస్సుల నిర్వహణపై అధికారులతో సమీక్ష జరుపుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని, భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టరు విజయకృష్ణన్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని సరిచేసే ప్రక్రియకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రామ సభలకు భూ యజమానులు హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించండి

» రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ శివదత్

నక్కపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయి కార్పొరేషన్ ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నరసింహారావుతో కలిసి బుధవారం పలు అంశాలు చర్చించారు. ఇకపై రాష్ట్ర కమిటీ ఆకస్మిక తనిఖీలు చేపడుతుందని చెప్పారు. అనంతరం తహసీల్దార్‌ను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ఆకేటి గోవిందరావు, నాయకులు కె.అప్పలరాజు, జగన్నాధరావు, పి.గణేశ్, రాజా, గిరీష్, బి.రాజు, పిక్కి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

‘కూటమి ప్రభుత్వంతోనే పల్లెల్లో వెలుగులు’

కోటవురట్ల, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే పల్లెల్లో వెలుగులు నిండుతున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సుంకపూర్, యండపల్లి, లింగాపురం తదితర గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరువేరుస్తామన్నారు. పల్లెల అభివృద్ధి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేయడమే కాకుండా పల్లెలను విచ్ఛిన్నం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాధం, మండల ఇంజనీర్ వర్మ, ఉపాధి పథకం ఏపీవో నాగరాజు, లింగాపురం సర్పంచ్ కె.రమణ, సుంకపూర్ సర్పంచ్ కాశీలక్ష్మి, జనసేన మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి: మండలంలోని దేవవరం, గొడిచెర్ల, చీడిక. ముకుందరాజుపేట, దోసలపాడు, రేబాక గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని అధికారులు, టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామాల్లో పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో డి.సీతారామరాజు కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, జడ్పీ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు కొండబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు, మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, టీడీపీ నాయకులు గింజాల లక్ష్మణరావు, వెలగా శ్రీను, పెదపూడి శంకరరావు, సూరిబాబు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో...

పాయకరావుపేట రూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనులతో పండగ వచ్చిందని వెంకటనగరం సర్పంచ్ వంకా వెంకటరమణ అన్నారు. మండలంలోని వెంకటనగరం, రాజవరం, కేశవరం గ్రామాలలో బుధవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సీసీ రోడ్లు, కాలువలు, తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గ్రామాలలో అభివృద్ధి పనులు చేయడానికి నిధులు విడుదల చేయక ఇబ్బందులు పడ్డామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాలలో నిజంగానే పండగా వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, ఉపాధి పథకం ఏపీవో హేమలత, పంచాయతీరాజ్ ఏఈ కచేరి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వైవీ.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సర్పంచులు ఎం.రామగోవిందు, జి.అమ్మాజీ, నాయకులు బి.కాశీవిశ్వనాథ్, ఆర్.తాతారావు, పి.గోవిందు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌ఏవోబీ పనులపై మత్స్యకారులతో సమావేశం


మాట్లాడుతున్న ఆర్డీవో రమణ, ఎన్‌ఏవోబి ఎస్‌డీసీ మనోరమ

ఎస్.రాయవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగారమ్మపాలెం గ్రామంలో ఎన్‌ఏవోబీ నిర్మాణ పనులపై బుధవారం ఆర్‌డీవో రమణ, ఎన్‌ఏవోబీ మనోరమ మత్స్యకారులతో సమావేశమయ్యారు. నిర్మాణ పనుల గురించి మత్స్యకారులతో ఈ సందర్భంగా ఆర్‌డీవో చర్చించారు. గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ ఎన్‌ఏవోబీకి సంబంధించి మొదట ఇచ్చిన జెట్టీ నిర్మాణం, మత్స్యకారులకు ఉపాధి వంటి పలు హామీలను అమలు చేయడంతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్‌ఏవోబీ నిర్మాణం వల్ల జరిగే నష్టాల గురించి మత్స్యకారులు అక్కడికి వచ్చిన అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ జె.రమేష్‌బాబు, మండల సర్వేయర్ త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరాయి పంచన ఎంఈవో కార్యాలయం

మండల విద్యా శాఖ కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉంది. ఇది కూలిపోయే దశకు చేరింది. దీన్ని పట్టించుకునే నాథులే కరువు కావడంతో పరాయి పంచన నిర్వహించాల్సి వస్తోంది. దీనికితోడు కరెంట్, ఇంటర్నెట్ బిల్లుల భారం తడిసి మోపెడవుతోంది.

- » శిథిలావస్థలో సొంత భవనం
- » పట్టించుకోని అధికార గణం
- » భవిత కేంద్రంలో కొనసాగుతున్న వైనం
- » కరెంట్, ఇంటర్నెట్ బిల్లుల భారం


శిథిలావస్థకు చేరిన ఎంఈవో కార్యాలయ భవనం ఇదే.. తలుపులు, కిటికీలు పాడైన దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాఠశాలల బాగోగులు, నిర్వహణ, విద్యా సంబంధిత అంశాలకు సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చేందుకు మండల కేంద్రాల్లో ఎంఈవో (విద్యా శాఖ) కార్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెండేళ్ల క్రితం వరకు ఎమ్మార్సీ భవనాలుగా ఉండే ఈ కేంద్రాలను మరలా ఎంఈవో కార్యాలయాలుగా మార్పు చేశారు. తరచూ ఉపాధ్యాయులు కూడా ఎంఈవో కార్యాలయానికి వెళ్లి, తమ వృత్తికి సంబంధిత పనులకు నివేదికలను అందజేయాలి.

నక్కపల్లి మండలానికి సంబంధించి 83 పాఠశాలలు ఉన్నాయి. వీటిని పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన మండల విద్యా శాఖ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబు పెచ్చులు ఊడిపడున్నాయి. తలుపులు, కిటికీలు పాడయ్యాయి. 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాల్సి ఉంది. ఈ సమస్యను అధికారులు పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేక పక్కనే ఉన్న భవిత కేంద్రంలో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. దీనికితోడు కార్యాలయంలో ఎంఈవో సహా డేటా ఎంట్రీ ఆపరేటర్, మండల ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌కు సంబంధించిన ఒకరు, జూనియర్ అసిస్టెంట్ సహా ఎమ్మార్సీ ఉంటారు. ఇప్పటికిప్పుడు మండల స్థాయిలో పాఠశాలలకు సంబంధించి స్థితిగతులు,


ఎంఈవో కార్యాలయం కొనసాగుతున్న భవిత కేంద్ర భవనం ఇదే..

నాడు-నేడు పనులు, పుస్తకాల పంపిణీ, ఉపాధ్యాయులు హాజరు, ఉపాధ్యాయులకు సంబంధించిన పలు అంశాలను ఎంఈవో కార్యాలయం ద్వారా విద్యాశాఖకు ఎప్పటికప్పుడు నివేదికలు పంపుతారు. ఒక్కో మండలంలో అన్ని పాఠశాలలు కలిపి 50 నుంచి 90 వరకూ ఉంటాయి. ఇందుకు ఇంటర్నెట్ బిల్లుతో పాటు కరెంటు బిల్లు కూడా తడిసి మోపెడవుతోంది. సగటున ఒక్కో ఎంఈవో కార్యాలయానికి కరెంటు బిల్లు నెలకు రూ.2 వేలు, ఇంటర్నెట్ సేవల కోసం రూ.1000, స్టేషనరీ, ఇతర ఖర్చుల కోసం రమారమి రూ.1000 ఖర్చవుతున్నది. అంటే దాదాపు నెలకు ఒక మండల విద్యా శాఖ కార్యాలయంలో కనీసం రూ.5 వేల వరకూ ఖర్చవుతుంది. వైసీపీ పాలనలో విద్యాశాఖ కార్యాలయాల నిర్వహణకు ఎటువంటి నిధులు మంజూరు చేయకపోవడం, నిర్లక్ష్యం వహించడంతో ఈ భారమంతా ఎంఈవోలపైనే పడుతోంది. అయితే కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందన్న ఆశాభావంతో ఎంఈవోలు ఉన్నారు.

ఈ విషయమై ఎంఈవో కె.నరేశ్‌ను వివరణ కోరగా, తమ కార్యాలయ భవనం ప్రమాదకరంగా ఉందని తెలిపారు. దీంతో సమీపంలో ఉన్న భవిత కేంద్రంలో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

పాయకరావుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు గల కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్మాణ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ మయూరి పట్నాల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన 18 నుంచి 28 ఏళ్ల లోపు నిరుద్యోగ యువతకు టైపింగ్, ఎంఎస్.ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్ బేసిక్ అకౌంట్ స్కిల్స్ తదితర కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎన్‌ఏడీ, బాజీ జంక్షన్ విశాఖపట్నం, లేదా సెల్ నంబర్లు 99081 04113, 63041 59549లో ఈ నెల 19వ తేదీలోగా సంప్రదించాలని కోరారు.

వార్డు సభ్యులకు శిక్షణ

ఎస్.రాయవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ వార్డు సభ్యులకు గ్రామ పరిపాలనపై అవగాహన ఉండాలన్నారు. రిసోర్స్‌పర్సన్ చిన్నం నాయుడు వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాధ, పలు గ్రామాల వార్డు సభ్యులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు,

సమస్యలపై కారిడార్ రైతుల వినతి

నక్కపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): న్యాయం చేయాలని కోరుతూ కారిడార్ కోసం భూములు ఇచ్చిన నిర్వాసిత రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బుచ్చిరాజుపేట, రాజయ్యపేట గ్రామాల్లో బుధవారం జరిగిన గ్రామసభల్లో సీపీఎం నేత ఎం.అప్పలరాజు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. సీపీఎం నేతలు పాల్గొన్నారు.

భూ సర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు


సిబ్బందితో సమీక్షిస్తున్న తహసీల్దార్ తిరుమలరావు

కోటవురట్ల, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): భూ రీసర్వే జరిగిన 13 గ్రామాల్లో గురువారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ తిరుమలరావు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలు, సర్వేయర్లు, ఆర్‌ఐలతో బుధవారం సమీక్షా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి రోజు సుంకపూర్ గ్రామంల సదస్సు ఏర్పాటు చేస్తామన్నారు. రీ సర్వేలో జరిగిన తప్పులు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, తదితర సమస్యలపై అందిన ఫిర్యాదులను 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని చెప్పారు. సదస్సులు విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీటీ రమేష్ పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్: మండలంలో గురువారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. మొదటి రోజు ఎస్.నర్సాపురం సభ జరుగుతుందని చెప్పారు. భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాలలో ఈ సభలు నిర్వహించి అన్ని భూ సమస్యలపై ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. రీ సర్వేలో నష్టపోయిన రైతుల సమస్యను పరిష్కరిస్తామని, ఈ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్.రాయవరం: భూ రీ సర్వేలో జరిగిన తప్పుల సవరణకు సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని ఏడు గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. వీటి ద్వారా రీ సర్వే తలెత్తిన సమస్యలన పరిష్కరిస్తామన్నారు. ఈ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

వైన్ షాపుల్లో పది శాతం రిజర్వేషన్ గొప్ప నిర్ణయం

రాష్ట్ర యాత కమిటీ డైరెక్టర్ పాండురంగ


గీత కార్మికుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎప్పుడూ లేని విధంగా గీత కార్మికులను గుర్తించి వైన్ షాపుల్లో పది శాతం రిజర్వేషన్ కల్పించడం గొప్ప నిర్ణయమని రాష్ట్ర యాత కమిటీ డైరెక్టర్ గుత్తుర్తి పాండురంగ అన్నారు. బుధవారం నక్కపల్లిలో నియోజకవర్గ స్థాయిలో 25 కల్లు గీత సొసైటీల ప్రతినిధులు, యాత, శెట్టిబలిజ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు కేటాయించిన పది శాతం వైన్‌షాపుల్లో దళారుల ప్రమేయం లేకుండా చూడాలని కోరారు. అలాగే పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. సంఘ ప్రతినిధులు బి.సత్యనారాయణ, డి.అప్పారావు, కె.అప్పలకొండ, పిల్లి రాంబాబు, పి.శ్రీను, దుంగా అప్పలరాజు, రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నక్కపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వేంపాడు సబ్ స్టేషన్ పరిధిలోని గొడిచెర్ల, వేంపాడు, నెల్లిపూడి ఫీడర్లలో గురువారం కొన్ని విద్యుత్ పనులు చేపట్టాల్సి ఉందని, దీంతో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్స్) ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేంపాడు, డీఎల్‌పురం, చినదొడ్డిగల్లు, డొంకాడ, రేబాక, ముకుందరాజుపేట, నెల్లిపూడి, గునిపూడి గ్రామాల్లో సరఫరా ఉందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏడు మద్యం దుకాణాలు ప్రారంభం

- » ఎలమంచిలి మండలంలో నిర్దేశిత ప్రదేశాల్లో ఏర్పాటు
- » ఉదయం నుంచి సరకు కోసం ఎదురు చూపులు... మధ్యాహ్నం రాకతో చకచకా అమ్మకాలు
- » ప్రతి షాపును ఎక్సైజ్ అధికారులు పరిశీలించి సూచనలు


ఏటికొప్పాకలో ప్రారంభమైన కొత్త మద్యం దుకాణం

ఎలమంచిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీలో భాగంగా వేలం పాట ద్వారా మద్యం దుకాణాలకు అనుమతులు పొందినవారు బుధవారం మధ్యాహ్నం సదరు దుకాణాలను ప్రారంభించారు. ఎలమంచిలి పట్టణంతో పాటు మండలంలో ఏడు మద్యం దుకాణాలు కేటాయించడంతో నిర్వాహకులు నిర్దేశించిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఉదయం నుంచే మద్యం సరఫరా అవుతుందని ఆశించిన వినియోగదారులకు మధ్యాహ్నం వరకు నిరాశే ఎదురైంది. రెండు గంటల తరువాత మద్యం దుకాణాలకు చేరడంతో అమ్మకాలను ప్రారంభించారు. సదరు దుకాణాలను ఎక్సైజ్ అధికారులు పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

యోగాలో కానిస్టేబుల్ నిర్మలకు పతకం


నిర్మలను అభినందిస్తున్న ఎమ్మెల్యే

అచ్యుతాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : యోగా చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ ఎం.నిర్మలను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ ఇక్కడ అభినందించారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర భిలాయ్‌లో ఏర్పాటైన ఆలిండియా పోలీస్ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో నిర్మల పాల్గొని అద్భుత ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ఆమెను అభినందిస్తూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.

విజయవాడలో అర్జీలు స్వీకరించిన సుందరపు

అచ్యుతాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జనవాని కార్యక్రమానికి ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల కష్టాలను ఆయన తెలుసుకుని, అర్జీలను స్వీకరించారు. వీటి పరిష్కారానికి ఆయా విభాగాల అధికారులు చర్యలు చేపట్టాల్సిందిగా ఆయన కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వంలోని పాలకులం అంతా పనిచేస్తున్నామని ఆయన వివరించారు.

అభిజిత్ పరిశ్రమ మూసివేత చట్ట విరుద్ధం

- » కార్మికుల కుటుంబాలు రోడ్డున పడడానికి సంస్థే కారణం
- » ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి
- » సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నరసింగరావు


సంస్థ గేటు వద్ద కార్మికులు చేపట్టిన ఆందోళనలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత సీహెచ్.నరసింగరావు

అచ్యుతాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సెజ్‌లో గల అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కర్మాగారం మూసివేత చట్ట విరుద్ధమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు అన్నారు. కర్మాగారం ఎదుట కార్మికులు చేపట్టిన ఆందోళన బుధవారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారికి మద్దతు ప్రకటించి మాట్లాడారు. కార్మికులకు పూర్తి జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం లే ఆఫ్‌కి ప్రకటించిన కారణాలు సహేతుకం కావన్నారు. జీతాలు ఎగ్గొట్టడానికి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. వెయ్యి కుటుంబాలు రోడ్డున పడడానికి కారణమైన అభిజిత్ కర్మాగారం యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కర్మాగారం కోసం భూములు ఇచ్చిన నిర్వాసిత రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మోసం చేసిందన్నారు. తక్కువ జీతాలకు కాంట్రాక్టు పద్ధతిపై వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపించారు. కార్మిక చట్టాలు సక్రమంగా అమలుచేయక పోవడమే కాకుండా ఉద్యోగులకు భద్రత కూడా కల్పించడం లేదన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి దర్యాప్తు జరిపి, కర్మాగారాన్ని తెరిపించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో నాయకులు జి.కోటేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ, రొంగలి రాము, బుద్ద రంగారావు, శివాజీ, రమణ, చిరంజీవిలతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

‘ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన’


గోకివాడలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలో నాయకులు, అధికారులు

రాంబిల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొరపూడి, హరిపురం, గోకివాడ, మూలజంప గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, టీడీపీ, జనసేనల మండల శాఖ అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, వివిధ శాఖల అధికారులు హాజరై రూ.52 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన సాగుతున్నట్టు చెప్పారు. ఈవోపీఆర్‌డీ రాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో పంచాయతీల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, ఉపాధ్యక్షుడు అందుకూరి ప్రసాద్, సర్పంచ్ వేగి అచ్చియ్యనాయుడు, హరిపురం సర్పంచ్ బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ ధూళి రమణ, పాల సంఘం అధ్యక్షుడు అప్పారావు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు

11న మునగపాకలో శూలాల మహోత్సవం


ముహూర్త రాటలో పాల్గొన్న నిర్వాహకులు, గ్రామ పెద్దలు

మునగపాక (తుమ్మపాల), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన మునగపాకలోని సాంబమూర్తి శూలాల మహోత్సవం వచ్చే నెల పదకొండో తేదీ సోమవారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ముహూర్తపు రాటను బుధవారం ఆలయ ప్రాంగణంలో వేశారు. మునగపాకలో ఏటా కార్తీక మాసం రెండో సోమవారం ఈ శూలాల మహోత్సవం జరుపుతుంటారు. సర్పంచ్ దిమ్మల అప్పా రావు, దేవస్థానం కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు, దాడి ముసిలినాయుడు, పెంటకోట సత్యనారాయణ, మళ్ల సంజీవరావు, దాడి శ్రీరామమూర్తి, ప్రకాశరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయం సందర్శన

మునగపాక (తుమ్మపాల), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపర్తిలో గల శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సీహెచ్.వెంకటరావు బుధవారం సందర్శించారు. తొలుత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ మారిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ ఇక్కడి గ్రంథాలయం పాత భవనంలో ఉండడంతో పాఠకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించాల్సిన డిజిటల్ లైబ్రరీ పునాదులకే పరిమితమైందని వాపోయారు. దీనిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం భవనం అసంపూర్తిగా నిలిచిపోయిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గణపర్తి శాఖ గ్రంథాలయ అటెండర్ లంబ అప్పలనరస, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మారిశెట్టి వెంకటరమణ, చదరం లోవ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

ఎలమంచిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ సర్వేలో లోటుపాట్లను సరిచేసేందుకు గురువారం నుంచి మండలంలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వరహాలు తెలిపారు. తొలిరోజు జంపపాలెంలో సభ ప్రారంభం కానుందన్నారు. ఈ నెల 26వ తేదీ వరకూ గ్రామాల్లో ఈ సభలు కొనసాగుతాయన్నారు. రెవెన్యూ పరమైన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

రాంబిల్లిలో జాబ్‌మేళా


ఇంటర్వ్యూ జరుపుతున్న ప్రతినిధులు

రాంబిల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సెజ్‌లో గల టీజే ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు బుధవారం రాంబిల్లిలో జాబ్‌మేళా నిర్వహించారు. తొలుత ఈ మేళాను టీడీపీ, జనసేన పార్టీల మండల శాఖల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర ప్రారంభించారు. రాంబిల్లి పరసర గ్రామాల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు టీజే ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు వరి వర్మ, సుంకరలు యువతీ, యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు ముప్పై మంది హాజరుకాగా, వారిలో ఇరవై మందిని ఎంపిక చేసినట్టు కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రాంబిల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) సంపూర్ణ ఆరోగ్యానికి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ వెంకటేష్ అన్నారు. హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో మాట్లాడారు. చిరుతిళ్లు, ఫాస్టుఫుడ్ వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఆహారం తీసుకున్నప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కొండకర్ల, దిబ్బపాలెం, మోటూరిపాలెం గ్రామాలకు చెందిన మహిళా రైతులు వివిధ రకాల చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శించారు. కేవీకే చైర్మన్ బి.శ్రీరామూర్తి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా కుర్రా, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త దివ్య సుధ, పశువైద్య శాస్త్రవేత్త విజయరాజ్ఞి, శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్, ఆర్ఎస్ఈఎల్‌డీ సమన్వయకర్త నాని తదితరులు పాల్గొన్నారు.

శారదానగర్‌లో మద్యం షాపు వద్దే వద్దు

» రెండవ వీధి వాసులు పట్టు » దుకాణం ఎదుట ఆందోళన



మద్యం షాపు ఎదుట ధర్నా చేస్తున్న స్థానికులు

కొత్తూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరులోని శారదానగర్ రెండవ వీధి వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని శారదానగర్ పరిరక్షణ సమితి ప్రతినిధులు, స్థానికులు బుధవారం రాత్రి ఆందోళన చేపట్టారు. ఈ ప్రాంతంలో దేవాలయాలు, పాఠశాలలు ఉన్నాయని, నిత్యం రద్దీగా ప్రధాన రోడ్డు ఉంటుందని అటువంటి చోట మద్యం షాపును ఏర్పాటు చేయడం తగదని వాపోయారు. గతంలో శారదానగర్‌లో ఉన్న కొత్త బ్రిడ్జి దగ్గర నుంచి కేబీ రోడ్డుకు వెళ్లే బ్రిడ్జి వరకు ఎటువంటి మద్యం షాపులు ఏర్పాటు చేయకూడదని పంచాయతీలో తీర్మానం చేసుకున్నామని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపు ఏర్పాటు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. మంగళవారం రాత్రి ఇదే విషయమై నిరసన తెలియజేస్తే షాపు ఏర్పాటు చేయబోమని చెప్పి, బుధవారంషాపు ఏర్పాటు పనులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. జన సంచారం లేనిచోట మద్యం షాపు ఏర్పాటు చేసుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ లక్ష్మణనాయుడును వివరణ కోరగా, ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాలకు తాత్కాలికమైన అనుమతులు మాత్రమే ఇచ్చామన్నారు. స్థానికుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా స్వీకరించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో శారదానగర్ పరిరక్షణ సమితి ప్రతినిధులు తాడి శ్రీనివాస చక్రవర్తి, వైజర్ల వర్మ, వేపాడ సత్తిబాబు, భారతి, రాయపు లక్ష్మణరావు, రాంబాబు, ప్రమీళా, రాజాన చిన్నమ్మలు, ప్రభ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం జిల్లా గ్రీవెన్స్ : రిజిస్ట్రార్

అనకాపల్లి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇకపై ప్రతి శుక్రవారం రిజిస్ట్రేషన్ నేస్తం పేరుతో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు జిల్లా రిజిస్ట్రర్ డాక్టర్ మన్మథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన కక్షిదారుల సందేహాలను, వారివారి సమస్యలను పరిశీలించేందుకు ప్రతి శుక్రవారం అనకాపల్లిలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించనున్నామని వివరించారు. కక్షిదారులకు వచ్చే సందేహాలు, సమస్యలను వింటూ వారు సలహాలను కూడా స్వీకరించడం జరుగుతుంద పేర్కొన్నారు. ఈ విషయాన్ని కక్షిదారులంతా గమనించాలని కోరారు. నేరుగా లేదా 70939 21385 నంబరుకు కాల్ చేసి గ్రీవెన్స్ నమోదు చేసుకోవడంతో పాటు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునని తెలిపారు.

సాహిత్య కళాజాతరకు సాయిరాంకు ఆహ్వానం



సాయిరాం

పరవాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతర వరల్డ్ రికార్డులో పాల్గొనేందుకు పరవాడ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయిరాంకు ఆహ్వానం అందింది. కవి, రచయిత, గాయకులు, సామాజికవేత్త అయిన సాయిరాం గతకొంతకాలంగా ఇక్కడి పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అయనను వైద్యాధికారులు డాక్టర్ హారిక, జయశ్రీ కర్మిషా, ఆప్తాలిక్ ఆఫీసర్ ఆర్.వెంకటరావు, సీనియర్ అసిస్టెంట్ ఆనందకుమార్, వైద్య సిబ్బంది అభినందించారు.

'సాగర్ సిమెంట్'లో జీతాలు పెంచాలని ధర్నా



సంస్థ వద్ద ధర్నా చేస్తున్న ట్రాన్స్‌పోర్టు కార్మికులు

కశింకోట, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : బయ్యవరం వద్ద ఉన్న సాగర్ సిమెంటు ఫ్యాక్టరీ వద్ద లారీ డ్రైవర్ల ధర్నా బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, జిల్లా కమిటీ సభ్యులు దాకారపు శ్రీనివాసరావు, ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు గోవింద మాట్లాడారు. గత మూడు రోజులుగా విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టినా యాజమాన్యం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. తగ్గించిన కమిషన్ కొనసాగింపు చేయాలని, కంపెనీ ఆవరణలో బాత్‌రూమ్‌లు, రెస్టు రూమ్‌లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నేతలు మణిబాబు, అప్పలనాయుడు, సురేష్, హరేకృష్ణ, యాదవరాజు, సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ డెయిరీలో అక్రమాలపై విచారణ చేపట్టాలి'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీలో అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం జిల్లా కలెక్టర్‌ను బుధవారం ఓ లేఖలో కోరారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వ్యవసాయం తరువాత ప్రధాన జీవనాధారం పాడి పరిశ్రమగా పేర్కొన్నారు. ఈజిల్లాల పరిధిలో దాదాపు 3500 గ్రామాలకు చెందిన మూడు లక్షల మంది పాడి రైతులు పాల ఉత్పత్తి సంఘాల ద్వారా విశాఖ డెయిరీకి పాలు అందజేస్తున్నారని వివరించారు. అటువంటి పాడి రైతుల ఆస్తులను పరిరక్షించి ప్రోత్సహించాల్సిన డెయిరీ పాలకవర్గం సొంత ఆస్తులను కూడబెట్టుకోవడానికి అవినీతికి పాల్పడుతుందని ఆరోపించారు. మొత్తం ఏడు అంశాల పై సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు.

వివిధ పోటీల విజేతలకు బహుమతులు



వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో రామాయణంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. మావూరి రాంప్రసాద్ ప్రోత్సాహంతో ఈ నెల ఆరో తేదీన విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో జూనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంవీ శరణ్య, పి.హేమంత్, జె.వరుణ్, సీనియర్స్ విభాగంలో పి.లోవంత్, వి.మేరీక్రిస్టల్, ఎ.మంజు పొందారు. వ్యాసరచన పోటీల్లో జూనియర్స్ విభాగంలో కె.కుందన, దాడి చంద్రిక, బి.ధనుశ్రీ, సీనియర్స్ విభాగంలో పి.ఈశ్వర్, జి.గగన్‌కుమార్, ఎం.లోహిత ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నారు. తెలుగు భాష పరిరక్షణ సమితి కన్వీనర్ కొయిలాడ రామ్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రాంప్రసాద్, దుర్గశ్రీలు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమశేఖర్ విద్యాసంస్థల అధినేత కొణతాల జనార్దన్, పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్, తెలుగు భాష పరిరక్షణ సమితి ప్రతినిధులు మాధవీసనారా, తమ్మిరాజు, అమరజ్యోతి, మల్లేశ్వరిలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉజ్వల 'భవిత'

» ఈ దిశగా కేంద్రాల సిబ్బంది పనిచేయాలి » అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



భవిత కేంద్రంలో దివ్యాంగుల విద్యాభ్యాసాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

కశింకోట, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో ఉన్న భవిత కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ విద్యా బోధనపై దివ్యాంగులకు పలు ప్రశ్నలు వేశారు. ఇరవై మంది విద్యార్థులున్న ఈ కేంద్రంలో మధ్యాహ్న భోజన పథకం అమలును అడిగి తెలుసుకున్నారు. ఒక్కో విద్యార్థిని పిలిచి నేరుగా పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. అంతేకాకుండా వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఫిజియోథెరపీ సేవలపై ఆరా తీశారు. భవిత కేంద్రంలోని విద్యార్థులకు మానసిక వికాసం పెంపొందించేలా బోధన సాగించాలని సూచించారు. అనంతరం నంబర్-2 పాఠశాలను సందర్శించి అక్కడ విద్యాబోధన, సౌకర్యాలను తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల, ఆర్డీవో షేక్ ఆయాషా, విద్యాశాఖ సహాయ సంచాలకులు జి.రామజ్యోతి, ఎంఈవో పి.వెంకటసురేష్, ఎంపీడీవో ఎ.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి భవిత కేంద్రం ఉపాధ్యాయులు బి.వి.రమణమ్మ, ఎస్.దీప, తదితరులున్నారు.

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు

» గృహ నిర్మాణ శాఖ అధికారులకు విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధర్ ప్రసాద్ ఆదేశం

» గొల్లలపాలెం లే-అవుట్-2లో నిర్మాణ పనులు పరిశీలన



గొల్లలపాలెం ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న విశాఖపట్నం కలెక్టర్ హరేంధర్ ప్రసాద్

సబ్బవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహ నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధర్ ప్రసాద్ గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం (ఎన్టీఆర్ కాలనీ)లో భాగంగా మండలంలోని గొల్లలపాలెం లే-అవుట్-2లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల పనుల ప్రగతిపై రోజువారీ నివేదిక అందజేయాలన్నారు. ఇటుక, ఇసుక, ఐరన్ నిలవలపై ఆరా తీశారు. ప్రతి బుధవారం ఉదయం ఒక లే-అవుట్‌ను తాను పరిశీలిస్తానని, మధ్యాహ్నం దానిపై అధికారులతో సమీక్ష జరుపుతానని వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత కాలంలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. లే-అవుట్ల తాజా పరిస్థితులు, నిర్మాణాల వివరాలను గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. గొల్లలపాలెం లే-అవుట్-1లో 1194 ఇళ్లు, లే-అవుట్-2లో 4612 ఇళ్లు నిర్మాణంలో ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, హౌసింగ్ డీఈ సూర్యారావు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

» పల్లె పండుగలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



తానాంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరణలో పంచకర్ల

పరవాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం పెదముషిడివాడ, కన్నూరు, తానాం, భరిణికం, పరవాడ, వెన్నెలపాలెం, గొర్లివానిపాలెం, ఈ.బోనంగి, పి.బోనంగి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ఈ కారణంగానే గ్రామీణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. అటువంటి పరిస్థితులు లేకుండా చేసేందుకు గాను కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. అభివృద్ధి పనులు ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, సర్పంచ్‌లు పల్లా నాగమణి, గొల్లవిల్లి నూకరత్నం, కన్నూరు దేవి, పెదిశెట్టి పూజ, గొర్లె అమ్ములు, సిరపురపు అప్పలనాయుడు, వెన్నెల అప్పారావు, బొడ్డపు శ్రీనివాసకాసులు, బండారు కల్పన, ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్, వివిధ శాఖల అధికారులు ,కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : దీర్ఘకాలం నుంచి గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు కూటమి ప్రభుత్వ పాలనలో మోక్షం లభిస్తుందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ



ఉగ్గినపాలెంలో డ్రైనేజీ ఏర్పాటుకు బుద్ద, తదితరులు శంకుస్థాపన

జగదీశ్వరరావు అన్నారు. మండలంలోని శంకరం, భట్లపూడి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, టీడీపీ నాయకులు జెర్రిపోతుల శ్రీనివాసరావు, తలారి కాశీనాయుడు, కరణం పవన్ పాల్గొన్నారు.

కశింకోట : కూటమి ప్రభుత్వంలోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. జమాదులపాలెం, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, తాళ్లపాలెం గ్రామాల్లో బుధవారం ఏర్పాటైన పల్లె పండుగలో మాట్లాడారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రామాలన్నీ అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. ప్రధానంగా గ్రామాల్లో రోడ్లు, మురుగు నీరు సక్రమంగా ప్రవహించేందుకు డ్రైనేజీలు ఏర్పాటు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం పలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మండల ప్రత్యేకాధికారిణి రోజారాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు ఒమ్మి సత్యనారాయణ, కర్రి వెంకట సత్యనారాయణ, మొల్లి రమణ, భీశెట్టి సుధా, భర్నికాన రాము, మంగ ఈశ్వర్, కసిరెడ్డి శ్రీను, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల పరిశుభ్రతపై వార్డు సభ్యులు ప్రత్యేక దృష్టి'



శిక్షణలో మాట్లాడుతున్న ఏఈఈ శ్రీనివాసరావు

సబ్బవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల పరిశుభ్రతపై వార్డు సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో పి.పద్మజ సూచించారు. వార్డు సభ్యులకు ఇక్కడ ఏర్పాటైన శిక్షణ శిబిరం బుధవారం ముగిసిన సందర్భంగా మాట్లాడారు. పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు దరిచేరవన్న అంశాన్ని గ్రామీణులకు వివరించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ మనిషికి 70 శాతం రోగాలు కలుషిత నీరు తాగడం వల్లే ప్రబలుతున్నట్టు చెప్పారు. అందువల్ల పంచాయతీ అధికారులు, సిబ్బంది సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో వాటర్ ట్యాంకులు నెలలో రెండుసార్లు శుభ్రం చేయడంతో పాటు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. అనంతరం గ్రామ పాలన, గ్రామాల పరిశుభ్రత, అభివృద్ధి పనుల్లో వార్డు సభ్యుల భాగస్వామ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై శిక్షకులకు అవగాహన కల్పించారు. ఈవోపీఆర్‌డీ చైతన్య, వార్డు సభ్యులు పల్ల తాతారావు, అంగటి నానాజీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మపాలలో పారిశుధ్య పనులు



గ్రామంలో యంత్రంతో రోడ్డు పక్క తుప్పల తొలగింపు

తుమ్మపాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య పనులను తుమ్మపాలలో బుధవారం ముమ్మరంగా చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. సీసీ రోడ్లకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలను తొలగించడంతో పాటు కాలువల్లో పూడిక తీసి గ్రామమంతా బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో ఈశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛ తుమ్మపాలగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లపై వేలాడుతున్న చెట్టుకొమ్మలను శుక్రవారం తొలగించనున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అనకాపల్లి టౌన్‌లోని ఫీడర్ గల గుండాల వీధి, లక్ష్మీదేవిపేట, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, కోర్టువీధి, గాంధీనగరం, అంజయ్యకాలనీ, విజయరామరాజుపేట, మిరియాల కాలనీ, ఏఎంసీ కాలనీ, శ్రీరామనగర్, రైల్వే అండర్ బ్రిడ్జి, ఎల్ఎన్ నగర్ ఫీడర్ పరిధిలోని స్టేషన్‌రోడ్డు, తాకాశి వీధి, మళ్లవీధి, కోట్నివీధి, గాంధీబొమ్మ జంక్షన్, చిన్నవీధి, పెరుగుబజార్ ప్రాంతాల్లో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

» రీ సర్వేలో పొరపాట్లు సరిచేసుకునేందుకు చక్కని అవకాశం

» అంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్లు విజ్ఞప్తి

కశింకోట, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 27 పంచాయతీల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగా తొలిరోజు గురువారం కొత్తపల్లిలో సభ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకు జరగనున్న ఈ సభల్లో భూముల రీసర్వేతో నష్టపోయిన రైతులు ఉంటే, క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని వివరించారు.

పరవాడ : భూములు రీసర్వే జరిగిన గ్రామాల్లో గురువారం నుంచి వచ్చే నెల ఐదో తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్‌వీ అంబేద్కర్ తెలిపారు. తొలిరోజు తానాం గ్రామంలో సభ ఉటుందన్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సభలు కొనసాగుతాయన్నారు. రైతులంతా తమ పట్టాదారు పాసు పుస్తకాలతో విధిగా గ్రామ సభలకు హాజరై సందేహాలను నివృత్తి చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

సబ్బవరం : మండలంలో గురువారం నుంచి రెవెన్యూ గ్రామ సభలు ప్రారంభం కానున్నాయని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. తొలిరోజు విప్పాక అగ్రహారంలో జరుగుతుందన్నారు. భూముల రీ సర్వేలో పొరపాట్లు జరిగితే వాటిన సరిచేసుకునేందుకు ఇదో చక్కని అవకాశంగా పేర్కొన్నారు.

'డిస్లెక్సియా'పై అవగాహన ర్యాలీ



పరవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పరవాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : డిస్లెక్సియా (భాషా అవరోధ బలహీనత)ను నిర్లక్ష్యం చేయరాదని ఎంఈవో దివాకర్‌రావు అన్నారు. పరవాడ భవిత కేంద్రంలో బుధవారం ఈ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దిష్ట అభ్యసన వైకల్యాలు ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అన్నిరకాల సేవలు, సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు విద్యార్థులంతా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. భవిత కేంద్రం టీచర్లు టి.కుమారి, జి. శ్రీనివాసరావు, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో జట్లు ఎంపిక

లంకెలపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లా అండర్-14 విభాగం బాలురు, బాలికల ఖోఖో జట్ల ఎంపిక గురువారం ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లాల కార్యదర్శులు వి.దేముడు, ఎంవీ నాగేశ్వరరావు, వి.కొండబాబు తెలిపారు. తొలుత ఈ పోటీలను అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ వర్షాల కారణంగా మైదానం అందుబాటులో లేకపోవడంతో లంకెలపాలెం హైస్కూల్‌కు మార్చాల్సి వచ్చిందన్నారు. ఈ మార్పును మూడు జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు గమనించాల్సిందిగా వారు కోరారు. క్రీడాకారులు ఉదయం తొమ్మిది గంటలకు లంకెలపాలెం హైస్కూల్‌కు చేరుకోవాలన్నారు.

తుమ్మపాల : చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగే 43వ అంతర్ జిల్లాల ఖోఖో పోటీలకు జిల్లా జట్టును ఈ నెల 19న అనకాపల్లి మండలం తుమ్మపాల క్రీడా మైదానంలో ఎంపిక చేయనున్నట్టు ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాడి జయవీర్, కార్యదర్శి సీహెచ్‌ఎల్‌ఎం శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొననున్న క్రీడాకారులు 2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని వివరించారు. ఆసక్తిగల వారు హాజరు కావాల్సిందిగా వారు కోరారు.

వరి, చెరకు పంటల్లో తెగుళ్ల నివారణకు సూచనలు



కశింకోట : ఏనుగుతునిలో వరి పంట పరిశీలిస్తున్న ఏవో

కశింకోట, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏనుగుతుని, నూతనగుంటపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ ఎం.రామారావు వరి, చెరకు పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ రెండు పంటలకు తెల్లచిత్త, పొడ తెగులు, దోమకాటు తదితర తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏవో ఎం.స్వప్న, వీఏఏ మధు, గొంతిన చిరంజీవి, సర్పంచ్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



కూండ్రంలోని రైతు సదస్సులో ఏవో రంగాచారి సూచనలు

కొత్తూరు : అనకాపల్లి మండలం కూండ్రం, కుంచంగి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రంగాచారి మాట్లాడుతూ వరి పంటలో తెగుళ్లు, పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. దీని నివారణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందరపు లక్ష్మి, ఎంపీటీసీ జెట్టి నాగమణి, టీడీపీ నాయకుడు నందారపు సూరిబాబు, గ్రామ వ్యవసాయాధికారి తులసి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.102 కోట్లు

పీఆర్ ఈఈ వీరన్ననాయుడు



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఈఈ వీరన్ననాయుడు

కె.కోటపాడు, అక్టోబరు 16 (ఆంధ్ర జ్యోతి): పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల సందర్భంగా అనకాపల్లి జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం 102 కోట్ల రూపాయలు కేటాయించినట్టు పంచాయతీరాజ్ ఈఈ వీరన్ననాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని చౌడువాడలో అభివృద్ధి పనులను పరిశీలించడానికి వచ్చిన సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ఆగస్టు 23న గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేయించిన పనులను ప్రస్తుతం చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి అధిక మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నట్టు ఈఈ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల ఏఈ సుమతి, గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పంచాయతీ కార్యదర్శి సురేశ్‌బాబు, తదితరులు వున్నారు.

సంతలతో ట్రాఫిక్ చింత

- అనంతగిరి, డముకు, కాశీపట్నంలలో రహదారులపై వ్యాపారాలు
- నిలిచిపోతున్న వాహనాలు
- ప్రమాదాల భయం
- జనాలకు తిప్పలు



కాశీపట్నం వద్ద వారపు సంత

అనంతగిరి, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారి ఆనుకుని వారపు సంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వ్యాపారులు, కొనుగోలుదారుల రద్దీతో గంటలకొలదీ ట్రాఫిక్‌లో చిక్కుకుంటూ అవస్థలు పడుతున్నారు. అరకు-విశాఖ ప్రధాన రహదారిని ఆనుకుని సోమవారం అనంతగిరి మండల కేంద్రంలో, అలాగే బుధవారం కాశీపట్నం, డముకు ప్రధాన వారపు సంతలు జరుగుతుంటాయి. అయితే, రోడ్లపై వ్యాపారులు దుకాణాలను ఏర్పాటుచేసి విక్రయాలు చేపడుతుండడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోతున్నాయి. పర్యాటకులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పోలీస్‌శాఖ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నా, రోడ్లపై సంతల వల్ల సమస్యలు యథాతథమవుతున్నాయి.

షెడ్లు ఉన్నా నిరుపయోగం

అనంతగిరి, కాశీపట్నం వద్ద సంతల్లో షెడ్లు ఉన్నప్పటికీ నిరుపయోగంగా మారాయి. వ్యాపారులు రహదారులపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు. డముకు వద్ద సంతషెడ్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అరకు-విశాఖ ప్రధార రహదారితో పాటుగా డముకు - నిమ్మలపాడు వెళ్లేమార్గమధ్యలో సంత నిర్వహిస్తుండడంతో అత్యవసర పరిస్థితిల్లో వాహనదారులు మరింత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్లపై దుకాణాలు ఏర్పాటుతో వాహనాలు అదుపుతప్పితే.. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సంతస్థలం మార్పు చేయాలని, వాహనదారులు కోరుతున్నారు.



రహదారికి ఆనుకుని అనంతగిరిలో వారపు సంత



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

25 వరకు డిగ్రీ పరీక్ష ఫీజు గడువు

పాడేరురూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సప్లిమెంటరీ, సెమిస్టర్ పరీక్ష ఫీజును ఈ నెల 25వ తేదీ లోగా చెల్లించాలని ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి ఒక ప్రకటనలో తెలిపారు. 2015-2019లో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు స్లమెంటరీ ఫీజు, బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు సెకెండ్ సెమిస్టర్ ఫీజు, 2015-2019లో డిగ్రీపూర్తి చేసిన విద్యార్థులు ఫోర్త్ సెమిస్టర్ ఎగ్జామ్‌నేషన్, థర్డ్ సెమిస్టర్ ఫీజులు చెల్లించాలని సూచించారు. అలాగే, 2020-2022 లో డిగ్రీ పూర్తి చేసిన స్లమెంటరీ వారు, కళాశాలలో రెగ్యులర్‌గా చదివిన విద్యార్థులు థర్డ్ సేమ్ అండ్ ఫిఫ్త్ సేమ్ బీఏ, బీకాం, బీఎస్సీఅన్ని గ్రూపుల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'మాడగడలో సమస్యలు పరిష్కరించాలి'

అరకులోయ, అక్టోబరు 16: మాడగడలో తాగునీటి సౌకర్యం, గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అధికారులను డిమాండ్ చేశారు.మూడు రోజుల కిందట ఈ గ్రామానికి చెందిన 11 మంది గిరిజనులు వాంతులు, విరేచనాలతో అరకుఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. బుధవారం గిరిజన సంఘం, సీఐటీయూలకు చెందిన ప్రధాన కార్యదర్శులు బాలదేవ్, అప్పలనర్స వేర్వేరుగా బాధితులను పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు.

'కాఫీ కార్మికుల సమస్యలపై సమ్మెకు సిద్ధం'

పాడేరురూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలోని పనిచేస్తున్న కాఫీ కార్మికుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం స్పందించకుంటే ఈ నెలలో ఏ క్షణంలోనైనా సమ్మె చేపట్టేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని కాఫీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్, కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.సుందరరావు ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యానికి హెచ్చరించారు. బుధవారం వారు పాడేరు డివిజనల్ మేనేజర్ కృష్ణబాబును కార్యాలయంలో కలిసి డిమాండ్‌లతో కూడిన సమ్మె నోటీసును అందించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సుందర్‌కుమార్, రామారావు, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

'ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి'

జి.మాడుగుల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద అధ్యాపకులు తమ సర్వీసు క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. ఈమేరకు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక ప్రభుత్వ కళాశాల ఒప్పంద అధ్యాపకులు బుధవారం పసుపు రంగు రుబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ జీవో 114 అమలు చేయాలన్నారు. అధ్యాపకులు బుల్లిరాజు, మోహన్‌బాబు, వెంకటరమణ, వేణు, రమణ, త్రివేణి, తిరుపతమ్మ రమేశ్‌నాయుడు పాల్గొన్నారు.

మనం సేవా సొసైటీ ఆధ్వర్యంలో కొళాయిల ఏర్పాటు

చింతపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మనం సేవా సొసైటీ ప్రతినిధులు కొళాయిలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్లేట్లు, చేతులు శుభ్రతకు ఇబ్బంది పడుతున్నారు. ఈవిషయాన్ని గుర్తించిన మనం సేవా సొసైటీ ప్రతినిధులు వ్యక్తిగత నిధులతో పది ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. ఈట్యాప్‌లను ఎంఈవో పనసల ప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా మనం సేవా సొసైటీ వ్యవస్థాపకుడు గౌతమ్ నరేంద్ర మహర్షి, హెచ్‌ఎం అప్పారావు పాల్గొన్నారు.

24న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, జడ్పీటీసీ సభ్యులు హాజరై ప్రస్తుతం నెలకొన్న సమస్యలపై చర్చిస్తారన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు

- కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రకృతి పద్ధతులతో వ్యవసాయంచేస్తే రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. మండలంలో గొండెలి ప్రాంతంలోని సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానం, పలు పంటల విత్తనాల సేకరణను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రకృతి పరమైన పద్ధతులతో వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు చేపట్టడడం ద్వారా భూసారం పెరగడంతోపాటు పంటల దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం తగ్గుతుందన్నారు. ఈకార్యక్రమంలో రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎల్. భాస్కరరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బీఎస్ నంద్, రైతు సాధికారత, వ్యవసాయ, ఉద్యానవన శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ప్రకృతి సేద్యం ద్వారా నాణ్యమైన అధిక పంట దిగుబడులు సాధ్యమని ఏవో శ్రీనివాస బాబు అన్నారు. బుధవారం మండలంలోని వనుగమ్మ, సుజనకోటల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మిల్కి, రమేష్, పలు శాఖల అధికారులుపాల్గొన్నారు.

తాళారుబయలులో పొలంబడి

జి.మాడుగుల: ప్రకృతి సిద్ధమైన పంటల సాగుతో అనేక లాభాలున్నాయని మత్స్యదేవత సీఈవో హనుమంతరావు తెలిపారు. మండలంలోని సొలభం పంచాయతీ తాశారుబయలులో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశీ విత్తనాలను వినియోగించాలి



గొండెలి గ్రామంలో ప్రకృతి విత్తనాల ప్రదర్శన పరిశీలిస్తున్న కలెక్టర్

పాడేరురూరల్: గిరిజన ప్రాంత రైతులు దేశీ విత్తనాలను వినియోగించాలని లగిశపల్లి ఎంపీటీసీ సభ్యుడు లకే రామకృష్ణ అన్నారు. మండలంలోని వంజంగి పంచాయతీ బొర్రమామిడిలో అమృత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన దేశీ విత్తన బ్యాంక్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విత్తన బ్యాంక్‌కు 22 రకాల విత్తనాలను సేకరించి తీసుకువచ్చిన ఎస్.కొత్తూరు రైతులు మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో లయ సంస్థ ప్రతినిధి ఈశ్వర్, అమృత వెల్ఫేర్ సొసైటీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సీలేరు: జీకేవీధి మండలం ధారకొండలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లి ఆర్ఏఆర్ఎస్ కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి సాగులో అత్యాధునిక పద్ధతులపై రైతులకు పలు సూచనలందించారు. జీకేవీధి ఎంఏఓ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని స్నేహం

- రోడ్డు ప్రమాదంలో మిత్రులు దుర్మరణం
- కశింకోట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదం
- స్వస్థలం నక్కపల్లి మండలం
- విశాఖ నుంచి బైక్‌పై వస్తుండగా ఘటన



బర్నికుల రాజేశ్(ఫైల్)



కురందాసు ప్రతాప్ (ఫైల్)

కశింకోట/ నక్కపల్లి (అనకాపల్లి జిల్లా), అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : వారిద్దరూ ప్రాణ స్నేహితులు. ఎక్కడకు వెళ్లినా ఇద్దరూ కలిసే వెళ్లేవారు. చివరకు మరణంలోనూ తమ స్నేహబంధం వీడదీయరానిదంటూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ ఒకేసారి మృత్యువాతపడ్డారు. నక్కపల్లి మండలం నెల్లిపూడి, ఉద్దండపురం గ్రామాలకు చెందిన వీరు జాతీయ రహదారిపై మండల కేంద్రమైన కశింకోట వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ సంఘటనకు సంబంధించి కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలిలా వున్నాయి. నక్కపల్లి మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన బర్నికుల రాజేశ్ (24), గునిపూడికి చెందిన కురందాసు ప్రతాప్ (26) చిన్నప్పటి నుంచి స్నేహితులు. కురందాసు ప్రతాప్ ఉద్దండపురంలో నివాసం వుంటున్నాడు. విశాఖపట్నంలో కారు డ్రైవర్లుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. మంగళవారం రాత్రి విశాఖ నుంచి ద్విచక్రవాహనంపై నక్కపల్లి మండలానికి బయలుదేరారు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో కశింకోట వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొన్నది. ప్రతాప్, రాజేశ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. యువకులిద్దరూ అప్పటికే మృతిచెందినట్టు గుర్తించారు. మొబైల్ ఫోన్‌లో వున్న నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బుధవారం ఉదయం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాన్నట్టు చెప్పారు. కాగా మృతిచెందిన యువకులిద్దరూ అవివాహితులే! చేతికి అందివచ్చిన బిడ్డలు రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

రైతుల ఇళ్లకు వెళ్లి కాఫీ పిక్కలు కొనుగోలు



మాట్లాడుతున్న జీసీసీ డీఎం సింహాచలం

ముంచంగిపుట్టు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ద్వారా రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి కాఫీ పిక్కల కొనుగోలు చేస్తామని పాడేరు జీసీసీ డీఎం డి.సింహాచలం అన్నారు. మండలంలోని బాబుసాల పంచాయతీ మత్స్యపురం గ్రామంలో బుధవారం కాఫీ రైతులతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ కాఫీ పంటను జీసీసీ వద్దనే విక్రయిస్తే, అధిక లాభాలు పొందేందుకు వీలవుతుందన్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది అధికంగా కాఫీ రకం బట్టి ధరలను నిర్ణయించామన్నారు. జీసీసీ కొనుగోలు చేసిన 24 గంటలలో రైతుల వ్యక్తిగత ఖాతాలో నగదు జమ అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాఫీ సబ్ అసిస్టెంట్ శ్రీరాములు, కాఫీ సేల్స్‌మెన్లు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

దుంబ్రిగుడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోన పోతంగి పంచాయతీ పీటీజీ గ్రామమైన అంత్రిగుడలో ఇళ్ల నిర్మాణ పనులు వేగవతం చేయాలని గృహ నిర్మాణశాఖ జిల్లా పీడీ బాబు పిలుపునిచ్చారు. గ్రామాన్ని ఆయన బుధవారం సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ జన్‌మన్ పథకం ద్వారా ఒక్కొక్కరికీ రూ2.30లక్షలు మంజూరు చేస్తోందన్నారు. మండల వ్యాప్తంగా మొదటి విడతలో 432, రెండులో 70, మూడో విడతలో 9ఇళ్లను మంజూరు చేసినట్టు చెప్పారు. నిర్మాణ పనుల్లో దశల వారీగా బిల్లులను వారం రోజులలోగా ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఆ శాఖ మండల ఇన్‌చార్జి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- వాడవాడలా పల్లె పండుగ

పాడేరురూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):ఎన్డీఏ కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వంద రోజుల పాలనలోనే నిరూపించారని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమం 3వ రోజు బుధవారం డి.గొందరు పంచాయతీ పాల్‌మాన్‌సంక గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను సైతం జగన్మోహన్‌రెడ్డి దారి మళ్లించారని ఆమె గుర్తు చేశారు.ఈ కార్యక్రమాల్లో టీడీపీ అరకు పార్లమెంట్ మహిళా కార్యదర్శి డిప్పల వెంకటకుమారి, బడిమెల సర్పంచ్ సోమెలి లక్ష్మణరావు, బర్సింగి సర్పంచ్ బోయిని చిట్టిబాబు, డోకులూరు సర్పంచ్ కుర్రబోయిన సన్నిబాబు, డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు, లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, జనసేన పార్టీ నేత దివ్యలత, ఉపాధి ఏపీవోసిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

చింతపల్లి: గిరిజన గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నదని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు అన్నారు. బుధవారం కొమ్మంగిలో పల్లెపండుగ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధి పథకంలో నిర్మించనున్న ఇంకుడు గుంతలకు భూమి పూజ చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు బేరా సత్యనారాయణ పడాల్, సర్పంచ్ పాంగి లక్ష్మి, ఉపాధి హామి పథకం టీఏ ప్రతిభ భారతి పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: పల్లె పండుగతో గ్రామాలు ప్రగతి పథంలో పయనించనున్నాయని ఎంపీడీవో శ్రీసాయి హర్ష అన్నారు.మండలంలోని సుజనకోట, ఏనుగురాయి, పెదగూడ పంచాయతీల పరిధిలో పల్లె పండుగ జరిగింది. సర్పంచులు వి.లక్ష్మణ్, వి.రమేష్, బాబూరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.సుబ్బలక్ష్మి, టీడీపీ నేతలు కె. జగదీరాయ్, ఎం.చిన్నిబాబు, వి.జగదీష్, సుభాష్, చిన్ని, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: పర్రెడా పంచాయితీ అంబాపడా గ్రామంలో డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ఆ పంచాయితీ సర్పంచ్ చెండా రవిశంకర్ శంకుస్థాపన చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీ బొంజుబాబు సహకారంతో గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రవికుమార్,సిహాద్రి, రామకృష్ణ, బాలు, సోమేశ్, జానకమ్మ పాల్గొన్నారు.



కొమ్మంగిలో ఇంకుడుగుంతల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశం

గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనే ధ్యేయం

దుంబ్రిగుడ: గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండలం అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. మండలంలోని గుంటసీమ, గుంటగన్నెల, రంగిలిసింగిల్లో ఎంపీడిఓ ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. సర్పంచులు నాగేశ్వరరావు, లక్ష్మి, మోతిలాస్, ఏపీవో సూరిబాబు, యూనిట్ ఇన్‌చార్జిలు చినగెన్ను, జక్కయ్య పాల్గొన్నారు.

'పల్లె పండుగకు ఆహ్వానించక పోవడం సరికాదు'

జి.మాడుగుల : మండలంలోని గెమ్మెలి పంచాయతీ కూనేటి గ్రామంలో బుధవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి అధికారులు తమను ఆహ్వానించక పోవడం సరికాదని స్థానిక కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎం.లక్ష్మణరావు, వి.రామన్నదొర, దినేశ్, వి.త్రినాథ్, బాలరాజు పాల్గొన్నారు.

కూనవరంలో పులి సంచారం

- పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసిన ఎస్ఐ, ఎఫ్ఆర్‌వో



ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎస్ఐ లతాశ్రీ, ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ కరుణాకర్

కూనవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండల పరిధిలో పులి సంచరిస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూనవరం ఎస్ఐ లతాశ్రీ, ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ కరుణాకర్ అన్నారు. పులి సంచరిస్తున్న ఆయా గ్రామాల్లో వారు పర్యటించి బుధవారం ప్రజలను అప్రమత్తం చేశారు. పెదనర్సింగపేట, దుగుట్ట, కాచవరం గ్రామాల్లో ఈసందర్భంగా చాటింపులు వేయించారు. పెద్ద పులి పశువులపై ఎటువంటి దాడి చేసినా, ఏమాత్రం ఆనవాళ్లు తెలిసిన వెంటనే ఆటవీశాఖాధికారులు, పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. పులి హాని చేస్తుందన్న భయంతో ఎటువంటి విషపూరిత ఆహారం పెట్టడం, కరెంటు తీగలు అమర్చడం వంటివి చేయవద్దని హెచ్చరించారు.

ఆడ పులి జాడ కోసమేనా..?

ప్రస్తుతం మండలంలో సంచరిస్తున్న ఈ పులి తోడు కోసం పయనిస్తున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆటవీశాఖాధికారుల లెక్కల ప్రకారం 2012 నుంచి ఈ ప్రాంతంలో పులి సంచరిస్తుంది. ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో ఇది తిరుగుతున్నట్టు చెబుతున్నారు. ఈ పులి రామచంద్రపురం అడవుల్లో దూగుట్టకు రెండు కిలోమీటర్ల పరిధిలో పులి ఓ చెరువు వద్ద నీళ్లు తాగినట్టు బుధవారం అధికారులు గుర్తించారు.

మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు: ఎస్ఐ

అనంతగిరి, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని స్థానిక ఎస్ఐ డి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని శివలింగపురం గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల వద్ద బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల జోలికిపోవద్దని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోని పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా ఎంఎల్‌సీ ఓటర్ల నమోదు

జి.మాడుగుల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్త రాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమం వేగవంతం చేస్తు న్నట్టు ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు ఎం. కైలాశం, జగన్‌మోహనరావు తెలిపారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలలో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఈ అవకాశాన్ని అర్హులంతా సద్వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకుడు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు ప్రక్రియను ముమ్మరంగా చేపడుతున్నట్టు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు మొస్యా సత్యారావు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో పెదగరువు ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం కొండమ్మ, ఏపీటీఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

- ఐటీడీఏ పీవో అభిషేక్



మాట్లాడుతున్న పీవో అభిషేక్

అరకులోయ, అక్టోబరు 16:(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులకు వీలుగా కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏటీడబ్ల్యూంఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన విద్యార్థులు భవిష్యత్తులో ఏం కాదలుచుకుంటున్నా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంజనీరింగ్ కోసం ఏ గ్రూప్ తీసుకోవాలి? అనే అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థలో ఎంబీఏ కోర్సు చదివితే ఉన్నత ఉద్యోగాలకు అవకాశం ఉంటుందన్నారు. బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టీకల్చర్, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సులకు సంబంధించి వివరాలు విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీడీ ఎల్.ఎల్. రజని, 11 మండలాల ఏటీడబ్ల్యూవోలు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా దుర్గాదేవీ నిమజ్జనం

సీలేరు, అక్టోబరు 16 (ఆంధ్ర జ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో బుధవారం రాత్రి దుర్గాదేవి నిమజ్జనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో నెలకొల్పిన శరన్నవరాత్రి మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. దీంతో నిమజ్జనం సందర్భంగా అమ్మవారిని పురవీధుల్లో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు.ఈసందర్భంగా ఏలూరి కి చెందిన అమ్మవారి శక్తి వేషాలు, జైపూర్‌కు చెందిన థింసా వాయిద్యాలు, డీజే సౌండ్లను ఏర్పాటు చేశారు. అనంతరం గుంటవాడ జలాశయంలో ఉత్సవ కమిటీ ఆధ్వ ర్యంలో నిమజ్జనం చేశారు.

చేయి చేయి కలిపారు.. రోడ్డు మరమ్మతులు చేపట్టారు


- లక్ష్మీపేట గ్రామస్తుల శ్రమదానం
- సోషల్ మీడియా ద్వారా రోడ్డు పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు వినతి



రోడ్డు మరమ్మతు పనుల్లో పాల్గొన్న గ్రామస్తులు

పెదబయలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డుకు మరమ్మతు పనులను లక్ష్మీపేట పంచాయతీ పరిధి గ్రామస్తులు శ్రమదానంతో చేపట్టారు. 2014-2019 టీడీపీ ప్రభుత్వ పాలనలో మండిబా నుంచి కోదువలస గ్రామం వరకు గల ఆర కిలోమీటరు మేర బీటి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ రోడ్డుపై డస్ట్ (క్రషర్ బుగ్గి) వేసి ఆర్ధాంతరంగా పనులు నిలిపివేసి కనుమరుగయ్యారు. దీనికితోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండపై నుండి బండరాళ్లు రోడ్డుకు అడ్డంగా పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంది. ఈ నేపథ్యంలో పిల్లలు, పెద్దలు, యువత కలిసి శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా కోదువలసకు చెందిన నర్సయ్య, మాలతి, వంశీ, మత్స్యరాజు, శ్రీను, సల్బు,రాజులమ్మ, బూందే మాట్లాడుతూ అసంపూర్తిగా నిలిచిన రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని సోషల్‌మీడియావేదికగా అరకుఎమ్మెల్యేను కోరినట్టు చెప్పారు.

'గిరిజన కాఫీ రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు లక్కు

పాడేరురూరల్, అక్టోబరు 16(ఆంధ్ర జ్యోతి): పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని గిరిజన కాఫీ రైతు జాతీయ కమిటీ నాయకుడు పాలికి లక్కు డిమాండ్ చేశారు. వనుగుపల్లిలో బుధవారం నిర్వహించిన కాఫీ రైతుల జిల్లా సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు..కాఫీ ఎపేక్స్ కమిటీ 2024-25 సంవత్సరానికి గాను ప్రకటించిన పార్చిమెంట్ కాఫీకి కిలో రూ. 285, అరబిక్ చెర్రీ కిల్లో రూ. 150, రోబోస్ట చెర్రీ కిలో రూ. 80ను గిరిజన కాఫీ రైతుల జాతీయ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. అరకు ఆర్గానిక్ కాఫీకి ప్రపంచ వ్యాప్తంగా మంచి ధర లభిస్తుందని ప్రచారం చేస్తూ పెద్ద పెద్ద బహుళ జాతి సంస్థలకు లాభాలు చేకూర్చి కాఫీ రైతులకు తక్కువ ధర ఇచ్చే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానం మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన కాఫీ రైతు సంఘం జిల్లా నాయకులు డి.బొజకజనకన, మత్స్యరాజు, వివిధ గ్రామాల కాఫీ రైతులు పాల్గొన్నారు.

బత్తుల తాతయ్యబాబుకు సత్కారం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబును బుధవారం ఆయన స్వగృహంలో అనకాపల్లి జిల్లా సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అగ్గాల హనుమంతరావు, సాధారణ కార్యదర్శి పి.సూర్యప్రసాద్, కార్యదర్శి సందపర్తి వరప్రసాద్ తదితరులు తాతయ్యబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాజీ సైనికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటుచేసి జీవో విడుదల చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

అధిక ధరలపై మందుబాబుల ఆగ్రహం

బుచ్చెయ్యపేట నాలుగు రోడ్ల కూడలిలో దుకాణం మూసివేత

బుచ్చెయ్యపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని మందుబాబులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం బుచ్చెయ్యపేట నాలుగు రోడ్ల కూడలిలో దుకాణం మూసివేయించారు. రూ.150 క్వార్టర్ మందు రూ.170కు, రూ.230 ఉన్న ఆర్ఎస్‌ను రూ.250కు మద్యం షాపు యాజమాని అమ్ముతున్నాడని దిబ్బిడి గ్రామానికి చెందిన రామారావు, శ్రీను, మాణిక్యం తదితరులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఘర్షణ తీవ్రతరం కావడంతో యాజమాని షాపును మూసివేశారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే మద్యం అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను మందుబాబులు కోరారు.

పొటాష్ లోపం నివారణపై దృష్టిసారించండి

రావికమతం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరిలో పొటాష్ లోపాన్ని నివారించడంపై దృష్టిసారించాలని మండల వ్యవసాయాధికారి డి.రూప సూచించారు. దిడ్డి గ్రామంలో బుధవారం రైతులతో కలసి వరి పొలాలను పరిశీలించిన ఆమె, అధిక శాతం పొటాష్ లోపం ఉన్నట్టు గుర్తించారు. వరి ఇప్పటికే అడుగు పొట్ట దశలో ఉన్నందున పొటాష్ లోపం అధిగమించేందుకు లీటర్ నీటికి ఐదు నుంచి పది గ్రాముల మల్టీకే ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. భూ సంరక్షణ గురించి రైతులకు వివరించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు 46 మంది ఎంపిక

దేవరాపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 46 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి అండర్-14, 17 సెపక్ తక్రా, ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. దేవరాపల్లి ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి పోటీలను సర్పంచ్ పెంటమ్మ ప్రారంభించారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 34 పాఠశాలల నుంచి 140 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-14, 17 ఫుట్‌బాల్ పోటీలకు బాలుర విభాగం నుంచి 18 బాలికలు ఎంపిక కాగా, సెపక్‌తక్రాకు అండర్-14, 17 విభాగాలకు ఐదుగురు చొప్పున బాలబాలికలు ఎంపికయ్యారు. వీరిని ఎంఈవో పడాల్ దాసు అభినందించారు.

నట్టల నివారణ మందులు అవసరం

పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు చిట్టినాయుడు

చీడికాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు సోకే ప్రాణాంతక వ్యాధులను అదుపు చేయడానికి నట్టల నివారణ మందులు ఎంతో అవసరమని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) చిట్టినాయుడు చెప్పారు. మండలంలోని ఖండివరం గ్రామంలో నట్టల నివారణ కేంద్రాన్ని బుధవారం ఏడీ ప్రారంభించగా, తురువోలు గ్రామంలో సర్పంచ్ మట్టా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు బీళ్ల కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు ఈ మందులు వేయకపోతే కడుపులో నులిపురుగులు పెరిగిపోయి రక్తాన్ని పీల్చేస్తాయన్నారు. తద్వారా జీవులు మృత్యువాత పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు గాయిత్రిదేవి, రాఘవమ్మ, అల్లూరి గణేష్‌కుమార్, టీడీపీ జిల్లా కార్యదర్శి రెడ్డి సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో వర్షం



కృష్ణాదేవిపేట ప్రధాన రహదారిలో హోరున కురుస్తున్న వాన

కృష్ణాదేవిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ మండిపోగా, సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో కొంతకాలంగా అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ వర్షంతో వరి, సరుగుడు, కూరగాయాల పంటలకు మేలు చేకూర్చుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

చీడికాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చీడికాడ పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉన్న ప్రతీ సభ్యుడు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని చోడవరం పీఏసీఎస్ జూనియర్ ఇన్‌స్పెక్టర్ కె.రమారత్నం కోరారు. చీడికాడ సొసైటీ కార్యాలయం ముందు బుధవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకున్న వారు కేంద్ర ప్రభుత్వం నుంచి రాయితీలకు అర్హులన్నారు. ఆధార్ కార్డు, భూమి తాలూకా వివరాల జెరాక్స్ కాపీలు, ఫోన్‌నెంబరు, నామినీపేరుతో సహా సొసైటీకి వివరాలు అందిస్తే ఈకేవైసీ చేస్తారన్నారు. సొసైటీ సీఈవో మజ్జి వరహాలుదొర పాల్గొన్నారు.

అధిక మోతాదులో నత్రజని పంటకు హానికరం

మాడుగుల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అధిక మోతాదులో నత్రజని వాడితే పంటకు హానికరమని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు అన్నారు. లోవపొన్నవోలు, జాలంపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరిపంటకు పాముపొడ తెగులు అధికంగా ఆశిస్తోందని, ఈ తెగులు ఉన్నప్పుడు నత్రజని ఎరువులు వాడకూడదని చెప్పారు. తెగుళ్లు సోకిన సమయంలో నత్రజని వినియోగిస్తే తీవ్రత అధికమవుతుందని చెప్పారు. వరి పంట చిరుపొట్ట దశకు చేరుకుంటే ఎకరానికి 25 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులు మితంగా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అన్‌రాక్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

నర్సీపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం అన్‌రాక్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని భూ నిర్వాసితులు తరఫున రుత్తల ఎర్రాపాత్రుడు సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. కంపెనీ ఏర్పాటుకు భూ సేకరణ సమయంలో ఇంటికో ఉద్యోగం, రెండు సెంట్ల భూమి, పాడి పశువులు కొనుగోలు చేసుకోవడానికి ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కోడూరు, రాచపల్లి సమీపంలో ఆటవీ భూమి అభివృద్ధి చేసుకోవడానికి వీఎస్ఎస్‌లలో భూ నిర్వాసితులు, చేతి వృత్తి వారిని సభ్యులుగా చేర్చి, వచ్చే ఆదాయంతో ఉపాధి చూపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎం.అప్పలనాయుడు, సిహెచ్.రాంబాబు, మాకిరెడ్డి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ



బుచ్చెయ్యపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చినప్పన్నపాలెంలో బుధవారం పైడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. మండపాలకు పునఃపూజలు, శేషహోమాలు, పూర్ణాహుతి, శిఖరయంత్ర అనంతరం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.భీమవరం, గొన్నవానిపాలెం, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, బంగారుమెట్ట, వడ్డాది తదితర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. రాష్ట్ర గృహనిర్మాణ కార్పొరేషన్ ఛైర్మన్ తాతయ్యబాబు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీరామమూర్తి, నాయకులు కోవెల ఈశ్వరరావు, దొండా నారాయణమూర్తి, పోతు కన్నయ్యదొర తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇటు ముగింపు.. అటు ఆరంభం!

- కొత్త మద్యం దుకాణాల వద్ద సందడి
- మూతబడిన సర్కారు షాపులు





సర్కారు షాపు మూసివేసి సామగ్రిని తరలిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది... కొత్త దుకాణం వద్ద మందుబాబుల సందడి

చోడవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం కొత్త మద్యం దుకాణాల వద్ద సందడి నెలకొంది. తక్కువ ధరలకే నాణ్యమైన మద్యం అందుబాటులోకి రానున్నట్టు ప్రచారం జరగడంతో ఉదయం నుంచే మందుబాబులు మద్యం దుకాణాల వద్దకు చేరుకున్నారు. లాటరీ తంతు ముగియడంతో బుధవారం రాత్రి సరకు తీసుకువచ్చిన వ్యాపారులు, గురువారం కొత్త దుకాణాల ఏర్పాటులో తలమునకలయ్యారు. ఉదయం నుంచి దుకాణాలు ప్రారంభించే హడావిడిలో మునిగిపోయారు. సరకు ఆలస్యంగా తేవడం, దుకాణాల ఏర్పాటు పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో తొలి రోజు పూర్తిస్థాయిలో దుకాణాలు ప్రారంభంకాలేదు. ఎనిమిది దుకాణాలకు గాను తొలి రోజు ఆరు దుకాణాలు ప్రారంభమయ్యాయి. దుకాణాల వద్ద తమకు నచ్చిన మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రావడంతో మందుబాబులు హర్షం వ్యక్తం చేశారు.

మూతపడిన సర్కారీ మద్యం దుకాణాలు

ప్రైవేటు మద్యం దుకాణాలు గురువారం నుంచి అందుబాటులోకి రావడంతో, ఇప్పటివరకు రద్దీగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను ఖాళీ చేసే ప్రక్రియను ఎక్సైజ్ అధికారులు చేపట్టారు. ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి, అందులోని సామగ్రిని ఎక్సైజ్ సిబ్బంది స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కూటమి ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది..

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్

గ్రామాల్లో ఉత్సాహంగా పల్లె పండుగ



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల కూటమి ప్రభుత్వం పని తీరు చూసిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న నమ్మకం ప్రజలలో మరింత పెరిగిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. నర్సీపట్నంలోని క్యాంప్ ఆఫీసులో బుధవారం విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నర్సీపట్నంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే సంక్షేమాన్ని అభివృద్ధిగా చూపెడుతున్నారని, ఎన్నికలకు ముందు నాణ్యత లేని పనులు చేసి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఇప్పుడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు నాయకత్వంలో నియోజకవర్గానికి రూ.17 కోట్లు నిధులు వివిధ అభివృద్ధి పనులకు తెచ్చారని తెలిపారు. సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.14.36 కోట్లు, తాండవ రిజర్వాయర్ గేట్లు మరమ్మతులు, ఇతర ఇరిగేషన్ పనులకు రూ.32 లక్షలు, కృష్ణాదేవిపేట రోడ్డు కల్వర్టు పనులకు రూ.43 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. వర్షాలకు నష్టపోయిన రోడ్లు, కల్వర్టులు మరమ్మతులకు రూ.96 లక్షలు మంజూరు చేయించారని ఆయన తెలిపారు. ఇసుక స్కామ్‌పై విచారణ జరుగుతుందని, అసలు దొంగ ఎవరో తేలుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దనిమిరెడ్డి మధు, రవివర్మ, చింటు పాల్గొన్నారు.

గొలుగొండ: పల్లె పండగ క్యాక్రమంలో భాగంగా రోడ్ల నిర్మాణానికి కూటమి నాయకులు బుధవారం శంకుస్థాపన చేశారు. చీడిగుమ్మల, గొలుగొండ, కొత్తజోగంపేట గ్రామాల్లో మట్టి రోడ్లను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేయడానికి రూ.10 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎ.అప్పలనాయుడు, బీమిరెడ్డి సత్యనారాయణ, సిహెచ్.సాంబమూర్తి, కామిరెడ్డి గోవింద్, సుర్ల బాబ్జీ, కొల్లి సత్యనారాయణ, కొల్లి రాంబాబు, గెడ్డం ఆనంద్, గాదె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలం సిహెచ్.నాగాపురంలో బుధవారం పల్లెపండగ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, మాజీ సర్పంచులు కొలగాని రామారావు, ప్రభాకర్‌రావు, గెడ్డం సత్యనారాయణ, శేషు, బొప్పన ప్రసాద్, కూటమినాయకులు వరహాలబాబు, రేగుబల్ల శివ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: కూటమి ప్రభుత్వంతోనే పల్లెల్లో వెలుగు నిండుతుందని టీడీపీ పార్టీ అధ్యక్షుడు ఆర్‌పై పాత్రుడు అన్నారు. పల్లె పండగ సందర్భంగా బుధవారం జంగాలపల్లి, బిఎస్‌పేట, పీపీ అగ్రహారం, నారాయణరాజుపేట గ్రామాల్లో రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఉపాధి పథకం ఏపీవో వరలక్ష్మి, టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, సింగంపల్లి రమణ, సత్యనారాయణ, బాబూరావు, సురేష్, దువ్వాసి వెంకటగిరి పాల్గొన్నారు.

నాతవరం: అధికారంలోకి వచ్చిన వంద రోజులలోనే కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ పేర్కొన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ములగపూడి, జిల్లేడిపూడి, గాంధీనగరం, శృంగవరం, ఎపీపురం గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలలో అభివృది కుంటిపడిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాన్ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్‌కుమార్, ఎస్.సన్యాసిదేముడు, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ పి.కొండబాబు, మాజీ సర్పంచ్ ఇటంశెట్టి రాధరత్నకుమారి, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు లాలం వెంకటరమణ జ్యోతి, టీడీపీ నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

చోడవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. అపోలో ఫార్మా, వరుణ్‌మోటార్స్, 2050 హెల్త్‌కేర్ తదితర సంస్థల నుంచి మేనేజ్‌మెంట్ ప్రతినిధులు హాజరై ఎంపికలు నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 94 మందికి ఆయా కంపెనీలు నియామకపత్రాలు అందించాయి. ఈ కార్యక్రమంలో స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ అప్పలనాయుడు, హెచ్ఆర్‌లు నాగార్జున, కిశోర్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, ఎస్ఎస్ఎస్ పీడీలు మాల్యాద్రి, పిచ్చమ్మ, రత్నభారతి తదితరులు పాల్గొన్నారు.

డిస్లెక్సియా వ్యాధిపై అవగాహన

చోడవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గోవాడ జడ్పీ హైస్కూల్‌లో గురువారం డిస్లెక్సియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాడీ సంబంధిత వ్యాధి వల్ల వెనుకబడిన బాలలకు ఎనిమిదేళ్లు వచ్చేలోగా గుర్తించి ప్రోత్సహిస్తే మిగిలిన వారితో సమానంగా రాణిస్తారని ప్రత్యేక ఉపాధ్యాయుడు వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాము, భవిత కేంద్రం ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

భూముల రీ సర్వే రికార్డులు రైతుల ముందు ఉంచాలి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే రికార్డులను రైతుల ముందుంచాలని సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు కోరారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో తప్పులు చోటు చేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. గ్రామ సచివాలయాల్లో సర్వే భూ రికార్డులను అందుబాటులో ఉంచితే రైతులకు తనిఖీ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రికార్డులు అందుబాటులో లేకుండా రైతులు తప్పులను ఎలా గుర్తిస్తారని ఆయన ప్రశ్నించారు.

ఉచితంగా డప్పుల పంపిణీ

రోలుగుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రోలుగుంటలో డప్పు కళాకారులకు ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ చేయూత అందించారు. ఎన్నికల హామీ మేరకు 20 డప్పు కళాకారులకు సొంత నిధులు వెచ్చించి డప్పులు అందించారు. భవిష్యత్తులో మరింత అండగా నిలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో నాయకులు రుత్తల శ్రీనివాసరావు, ఎంకే నాయుడు, ఒనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డైరెక్టర్ల ఎన్నిక వాయిదా

చీడికాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బైలపూడి గ్రామంలోని పాల కేంద్రంలో రెండు కోఆప్షన్ డైరెక్టర్ల ఎన్నికను రైతులు వాగ్వాదంతో వాయిదా వేశారు. పాల కేంద్రంలో ఎనిమిది మంది డైరెక్టర్లు ఉన్నారు. మరో ఇద్దరు డైరెక్టర్‌లను ఎన్నుకునేందుకు బుధవారం డైరెక్టర్‌ల సమావేశం ఏర్పాటుచేశారు. విషయం తెలుసున్న ఎస్ఐ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఎన్నిక నిర్వహణ కోసం సమాయత్తమవుతుండగా వివిధ పార్టీల నాయకులు, రైతులు మూకుమ్మడిగా వాగ్వాదం చేసుకోవడంతో పోలీసులు వారించారు. అయితే ఎన్నిక నిర్వహణకు కోరం సరిపోకపోవడంతో వాయిదా వేస్తున్నామని సొసైటీ కార్యదర్శి శరగడం సన్యాసినాయుడు తెలిపారు. కార్యక్రమంలో పాల కేంద్రం మాజీ అధ్యక్షులు జాజిమొగ్గల నాగరాజు, ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే తెగుళ్ల నివారణ

చీడికాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరి పొలంలో సోకే ప్రాణాంతక దోమల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కొండెంపూడి శాస్త్రవేత్త పి.బాబు కోరారు. వెల్లంకి, చెట్టుపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ముందుగా సదస్సులు నిర్వహించి వరి పొలాల్లో సోకే దోమలను గుర్తించి తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ సదస్సులో ఏవో రమాదేవి, సిబ్బంది మజ్జి రంగనాద్, దేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు పశు వైద్య శిబిరం

మాడుగుల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గాదిరాయి గ్రామంలో గురువారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. వమ్మలి, జంపెన, కృష్ణాపురం, వీరనారాయణం రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శివారు గ్రామాల్లో చెత్త తొలగింపు

గొలుగొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతమల్లంపేట గ్రామ పంచాయతీలో బుధవారం శివారు గ్రామాల్లో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ద్వారకానగరం, జోగంపేట జంక్షన్‌లో రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్‌తో తొలగించారు. అనంతరం బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రమణమ్మ, సర్పంచ్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకు ఆపన్నహస్తం

- చోడవరంలో కమ్యూనిటీ ఫ్రిజ్





స్వయంభూ విఘ్నేశ్వరాలయం వద్ద కమ్యూనిటీ ఫ్రిజ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు... కమ్యూనిటీ ఫ్రిజ్

చోడవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకు పట్టణానికి చెందిన సద్భావన బృందం యువకులు కమ్యూనిటీ ఫ్రిజ్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయం వద్ద ఈ ఫ్రిజ్‌ను ఏర్పాటు చేసి, అందులో అహారపదార్థాలు ఉంచారు. ఈ కమ్యూనిటీ ఫ్రిజ్‌ను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. రోడ్లపై తిరిగే సంచారజీవులు, ఆకలిగా ఉండి తినడానికి డబ్బులు లేని పేదలకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఈ ఫ్రిజ్‌ను నెలకొల్పారు. ఎవరైనా తమ ఇంట్లో పుట్టిన రోజు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సందర్భంగా పది మందికి ఆహారం పెట్టాలన్న ఉద్దేశం కలిగిన వారు ఆహార పదార్థాలు పెట్టేందుకు వీలుగా ఈ ఫ్రిజ్ ఏర్పాటు చేశారు. శుభకార్యాల సందర్భంగా మిగిలిన ఆహారపదార్థాలు వృథా కాకుండా పేదలకు ఉపయోగపడేలా ఇందులో పెడితే పదిమందికి కడుపునిండుతుందని సద్భావన టీమ్ సభ్యులు తెలిపారు. పట్టణంలో ఇతర ప్రాంతాల్లో కూడా త్వరలో ఈ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. తొలి రోజు పట్టణానికి చెందిన సంతోశ్ షాపింగ్ మాల్ అధినేత గుప్తా ఈ కమ్యూనిటీ ఫ్రిజ్‌లో ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీరన్ననాయుడు

అభివృద్ధి పనులకు రూ.102 కోట్లు కేటాయింపు

- పంచాయతీరాజ్ ఈఈ వీరన్ననాయుడు

కె.కోటపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల సందర్భంగా అనకాపల్లి జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం 102 కోట్ల రూపాయలు కేటాయించినట్టు పంచాయతీరాజ్ ఈఈ వీరన్ననాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని చౌడువాడలో అభివృద్ధి పనులను పరిశీలించడానికి వచ్చిన సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ఆగస్టు 23న గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేయించిన పనులను ప్రస్తుతం చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి అధిక మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నట్టు ఈఈ చెప్పారు. ఆయన వెంట మండల ఏఈ సుమతి, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పంచాయతీ కార్యదర్శి సురేశ్ బాబు, తదితరులు వున్నారు.

తాగునీటి సమస్యపై మహిళల ఆందోళన




ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రావికమతం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొమిర పాండవులవీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో సచివాలయం ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నేత గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే తప్పిదాల పరిష్కారానికి సదస్సులు

15 రోజుల్లోగా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం: తహసీల్దార్ రామారావు



విలేకరులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

చోడవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో తలెత్తిన తప్పిదాల భూ సమస్యల పరిష్కారానికి గురువారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ అంబటి రామారావు తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో లోటుపాట్లు, భూ రికార్డులలో తప్పిదాలు, ఇతరత్రా సమస్యలపై సదస్సుల్లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే, వాటికి 15 రోజుల్లోగా పరిష్కారం చూపుతామని చెప్పారు. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ సదస్సులు నిర్వహిస్తున్నదన్నారు. నెల రోజుల పాటు సదస్సులు నిర్వహిస్తామని, పంచాయతీల వారీగా జరిగే ఈ సదస్సులకు సంబంధించి ముందుగానే విస్తృత సమాచారం ఇస్తామని ఆయన తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్సులు కొనసాగుతాయన్నారు. మండలంలోని 32 పంచాయతీల్లో 25 పంచాయతీల్లో రీ సర్వే పూర్తయిందని, ఈ సర్వే నిర్వహించిన పంచాయతీల్లోనే రెవెన్యూ సదస్సులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తహసీల్దార్ తెలిపారు. ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గురువారం అన్నవరం సచివాలయం పరిధిలోని అన్నవరం, వెంకయ్యగారిపేటల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన అవసరం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషశ్రీ

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ చట్టాలపై సర్పంచులు, వార్డు సభ్యులకు అవగాహన అవసరమని ఎంపీడీవో ఉషశ్రీ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా 1994 పంచాయతీరాజ్ చట్టం నిబంధనలు, సభ్యుల విధులు, అధికారాలను వివరించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రమాకుమారి, సూపరింటెండెంట్ రమణబాబు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండలంలో రెండు రోజుల పాటు వార్డు సభ్యుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో గురు, శుక్రవారాలు ఈ శిక్షణ ఉంటుందన్నారు. సర్పంచులు, వార్డు సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె సూచించారు.

సరుగుడులో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ అందక ఇక్కట్లు

నాతవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరుగుడు గ్రామంలో 15 రోజులుగా బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ అందకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు చుక్కల రాంబాబు తెలిపారు. దూరంలో ఉన్న తమ బంధువులు పిల్లల క్షేమ సమాచారం తెలుసుకోవాలంటే సరుగుడు గ్రామం నుంచి బయటకు మూడు కిలోమీటర్లు వచ్చి సెల్‌లో మాట్లాడుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బి ఈఎస్ఎన్ఎల్ అధికారులు తక్షణమే స్పందించి ఇక్కడ సిగ్నల్స్ అందేలా తగిన చర్యలు చేపట్టి గిరిజనులు ఇబ్బందులు పడకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అప్రమత్తతే రక్ష



ఎసెన్షియా ఫార్మాలో మంటలు అదుపు చేస్తున్న దృశ్యం(ఫైల్)

ప్రాణాలు హరిస్తున్న ప్రమాదాలు

- ఇటీవల పరిశ్రమల్లో భారీగా సంభవిస్తున్న వైనం
- రోడ్డు, ఇతర ప్రమాదాల్లో గాయపడి కేజీహెచ్‌కు బాధితులు
- ప్రతిరోజూ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి 200 కేసులు
- జాగ్రత్తలు పాటిస్తేనే ఈ తరహా ప్రమాదాలకు చెక్

నేడు అంతర్జాతీయ ట్రామా డే

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): **కొన్నాళ్లుగా ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది. రోడ్డు, పారిశ్రామిక, ఇతర ప్రమాదాలు ఏటా వందలాది మందిని బలిగొంటున్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మనిషి గాయపడడాన్ని ట్రామాగా పేర్కొంటారు. ఈ గాయం దేనివల్ల అయినా సంభవించవచ్చు. రోడ్డు ప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు, ఇతర కారణాలు. ట్రామా కేసుల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలుండగా, ఆ తరువాత స్థానంలో పారిశ్రామిక ప్రమాదాలు నిలుస్తున్నాయి. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించి, ప్రమాదాలను తగ్గించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు 17వ తేదీన వరల్డ్ ట్రామా డేగా నిర్వహిస్తున్నారు.**



ఎసెన్షియా ఫార్మా ప్రమాదంలో మృతిచెందిన కార్మికుడు

వరల్డ్ ట్రామా డేను తొలిసారి 2011లో ఢిల్లీలో నిర్వహించారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దీనిని నిర్దేశించారు. దేశ వ్యాప్తంగా ప్రతిరోజూ 400 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు మరణిస్తున్నట్టు అప్పట్లో నిర్ధారణకు వచ్చారు. ఈ సంఖ్య భారీగా పెరిగింది. ఈ ఏడాది పని ప్రదేశాల్లో కలిగే ప్రమాదాల నివారణ, నియంత్రణ పద్ధతులు థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

గణనీయంగా ప్రమాదాలు..

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇటీవల పారిశ్రామిక ప్రమాదాలు పెరుగుతున్నాయి. వీటి వల్ల గత ఐదేళ్లలో సుమారు 120 మంది మృత్యువాత పడ్డారు. పరవాడ శ్రీకర్ ఫార్మాలో 2016లో గ్యాస్ లీకైన ప్రమాదంలో ఒకరు, 2017లో అజికో బయోఫోర్‌లో జరిగిన ప్రమాదంలో ఐదుగురు, 2019లో స్మైలెక్స్ లేబొరేటరీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు, విజయశ్రీ ఆర్గానిక్స్‌లో జరిగిన ప్రమాదంలో ఒకరు ప్రాణాలను కోల్పోయారు. 2020లో ఫార్మాసిటీలోని విశాఖ సాల్వెంట్స్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు, సాయినార్ ఫార్మాలో అదే ఏడాది జరిగిన ప్రమాదంలో ఇద్దరు, రాంకీ పంప్‌హౌస్‌లో 2022లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. 2020లో ఎల్‌జీ పాలిమర్స్‌లో జరిగిన ప్రమాదంలో 12 మంది ప్రాణాలను కోల్పోయారు. 2020లో హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో క్రేన్ ప్రమాదం సంభవించి 11 మంది, 2023 జూన్‌లో సాహితీ ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించి నలుగురు, 2023లో సింహాద్రి ఎన్‌టీపీసీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఎసెన్షియా ఫార్మాలో జరిగిన ప్రమాదంలో 17 మంది, సినర్జీస్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మొత్తంగా గత పదేళ్లలో సుమారు 150 మంది మృతి చెందగా, వందలాది మంది తీవ్ర గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందారు.

నియంత్రణపై దృష్టి సారించాలి..

పారిశ్రామిక ప్రమాదాలను నియంత్రించేందుకు అవకాశం ఉంది. ఆయా పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు సేఫ్టీ ఆడిట్ చేయడంతోపాటు ప్రమాదాలకు కారణమయ్యే పరికరాలను నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కొన్ని రియాక్టర్స్ బ్లాస్ట్ అయ్యే అవకాశం ఉంది. వాటి నిర్వహణ సరిగా లేకపోతే పెను ప్రమాదాలు సంభవిస్తాయి. కాబట్టి, పరిశ్రమల్లోని పరికరాల నిర్వహణపై యాజమాన్యాలు దృష్టి సారించాలి. ఇందుకోసం ప్రత్యేకంగా సేఫ్టీ టీమ్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఈ తరహా ప్రమాదాలకు చెక్ చెప్పేందుకు అవకాశం ఉంటుంది.

ఆందోళనకరంగా రోడ్డు ప్రమాదాలు..

ట్రామా కేసుల్లో సుమారు 60 శాతం రోడ్డు ప్రమాదాలే.వీటిలో ఎక్కువ మంది మద్యం మత్తులో ప్రమాదాలకు గురవుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా భావించే కేజీహెచ్‌లోని ట్రామా విభాగానికి ప్రతిరోజూ 200 వరకు కేసులు వస్తుంటాయి. వీటిలో ఆస్పత్రిలో చేరాల్సినవే 40 వరకు ఉంటున్నాయి. మరో 15 కేసులు తలకు తీవ్రమైన గాయాలైనవే వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని నియంత్రించేందుకు మద్యం తాగినప్పుడు వాహనాలను నడకుండా చర్యలు తీసుకోవాలి. మిగిలిన కేసుల్లో చెట్లు మేడ పైనుంచి పడినవి ఉంటున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఏటా 50 లక్షల మందికిపైగా రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలై మృతి చెందుతున్నారు. ప్రతి ఆరు సెకన్లకు ఒక రోడ్డు ప్రమాద మరణం సంభవిస్తోంది. దేశంలో ఏటా పది లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. మరో రెండు కోట్ల మంది ఆస్పత్రుల్లో చేరుతున్నారు.



ఆగస్టులో భారీ ప్రమాదం జరిగినఅచ్యుతాపురం ఎస్‌ఈజడ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంంపెనీ

ప్రమాద నివారణ చర్యలివి..

- మద్యం తాగి వాహనాలు పడకూడదు.
- ట్రాఫిక్ సిగ్నల్స్, నిబంధనలను కచ్చితంగా పాటించాలి.
- హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి.
- సుదూర ప్రాంతాలకు వాహనం నడిపే సందర్భంలో మధ్యమధ్యలో తగినంత విశ్రాంతా అవసరం.

పెరుగుతున్న కేసులు



గతంతో పోలిస్తే ట్రామా కేసులు పెరిగాయి. ప్రతిరోజూ కేజీహెచ్‌లోని క్యాజువాల్టీకి 200 వరకు ట్రామా కేసులు వస్తుంటాయి. వీటిలో తల, ఇతర శరీర భాగాలకు తీవ్రమైన గాయాలైన వారిలో 40 మంది వరకు ఇన్‌పేషెంట్‌గా చేరాల్సి వస్తుంది. ట్రామా విభాగానికి ప్రత్యేకంగా 50 పడకలు అందుబాటులో ఉన్నాయి. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు కేజీహెచ్‌కు భారీగా బాధితులు వస్తుంటారు. ఇటువంటి ప్రమాదాలను కొన్ని నియంత్రణ పద్ధతులు పాటించడం ద్వారా నివారించే వీలుంది. రోడ్డు ప్రమాద బాధితుల్లో దాదాపు పది శాతం మందికి తలకు గాయాలవుతున్నాయి.ఈ ప్రమాదాలను నియంత్రించేందుకు మార్గాలు, పద్ధతులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకూ ఏటా ట్రామా డే నిర్వహిస్తున్నాం. **- డాక్టర్ వీఎస్ఎన్ మూర్తి,** ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి

క్రైం... crime news

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

నర్సీపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు అందించిన వివరాల ప్రకారం.. మునిసిపాలిటీ పరిధిలోని చాకలి వీధిలో నివాసం ఉంటున్న గుడివాడ రవి(28) చికెన్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతని తల్లి సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బ్రిక్స్ పరిశ్రమ ప్రమాదంలో మరొకరి మృతి



కృష్ణారెడ్డి(ఫైల్)

ఎలమంచిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిబంద జాతీయ రహదారి పక్కన ఉన్న ఫ్యూజన్ బ్రిక్స్ పరిశ్రమ ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ఈ నెల 6న గ్యాస్ లీకై జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిజ్జు కృష్ణారెడ్డి(40) కూడా బుధవారం మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. మృతుడు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుహాని గ్రామానికి చెందినవాడని చెప్పారు. మృతదేహం కేజీహెచ్ మార్చురీలో ఉందని, కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అండర్-14 జిల్లా జట్లు ఎంపిక



బాలికల విజేత జట్టుతో నిర్వాహకులు

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపూడిలో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం అండర్-14 ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. మొత్తం 350 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో ప్రథమ స్థానం గాజువాక, ద్వితీయ స్థానం నర్సీపట్నం, బాలికల విభాగంలో ప్రథమ స్థానం అరకులోయ, ద్వితీయ స్థానం చోడవరం జట్లు నిలిచారని నిర్వహకులు డి.రవి, పి.సుమన్ తెలిపారు. ఈ పోటీల్లో చక్కటి ప్రతిభ చూపిన క్రీడాకారుల్లో నుంచి రాష్ట్రస్థాయిపోటీలకు జిల్లాస్థాయి జట్లను ఎంపికచేస్తామని తెలిపారు. ముగింపు ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, ఎంఈవో తలుపులు, పీఈటీలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	149.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు

- ఆర్చరీ ఎంపికల్లో అల్లూరి డీఈవో బ్రహ్మాజీ

అరకులోయ, అక్టోబరు16: (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించే వారికి భవిష్యత్తు ఉంటుందని అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మజీ అన్నారు. బుధవారం అరకులోయ క్రీడాపాఠశాల మైదానంలో నిర్వహించిన ఆర్చరీ అండర్ 14, 17 బాల, బాలికల విభాగాల్లో ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. మన్యంలో క్రీడాకారులకు కొదవ లేదని, ఎంతో మంది చిన్నారులు చక్కటి నైపుణ్యం ప్రదర్శిస్తున్నారన్నారు. పాఠశాలల్లో వ్యాయామోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి ఇలాంటి ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఎంఈవో త్రినాధరావు మాట్లాడుతూ పాడేరుకు చెందిన భైరాగినాయుడు జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని సత్తాచాటారని గుర్తు చేశారు. ఈ ఎంపికలో విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్న ట్టు అల్లూరి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ కొండబాబు తెలిపారు. స్థానికంగా ఎంపికైన వారు నవంబరు 3 వతేదీన పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగే రా ష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అరకులోయ క్రీడాపాఠశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, రవ్వలగుడ జీటీడబ్ల్యూ బాలుర పాఠశాల హెచ్‌ఎం హెచ్‌పీ కెందు, అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మోహన్, ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ సెక్రెటరీ కే బాలీ, మాజీ సెక్రెటరీ సూరిబాబు, ఆర్చరీ కోచ్ సూరిబాబు, పీడీలు టి.సద్దు మూపతిరాజు, చంద్రరావు, ప్రసాద్, సుబ్బారావు, సుధాకర్, రాము నాయుడు, ఏడా గిడ్డి అప్పారావు నాయుడు పాల్గొన్నారు.



అరకులోయ క్రీడాపాఠశాల మైదానంలో ఆర్చరీ ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో బ్రహ్మజీ

ఏటికొప్పాకలో మద్యం దుకాణం ఏర్పాటుపై వివాదం

- గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్

ఎలమంచిలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో బుధవారం మద్యం దుకాణం ఏర్పాటుపై వివాదం తలెత్తింది. గ్రామం మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ మార్కెట్ ప్రాంతానికి చెందిన కొందరు మహిళలు, యువకులు, స్థానికులు ఆందోళన చేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎక్సైజ్ సీఐ తేజో వెంకట కుమార్, రూరల్ ఎస్ఐ ఉపేంద్ర మార్కెట్ వీధి ప్రాంతాన్ని సందర్శించారు. ఈ విషయమై స్థానికులతో మాట్లాడారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని వారు తెగేసి చెప్పారు. ఈ క్రమంలో షాపు నిర్వాహకులు, స్థానికులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మద్యం దుకాణం ఏర్పాటు ప్రభుత్వ నిబంధనల మేరకే జరుగుతుందని, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని చెప్పి ఎక్సైజ్ సీఐ వెళ్లిపోయారు. మద్యం దుకాణానికి సరకు లోడ్ సాయంత్రం ఆరు గంటలకు వస్తుందని తెలిసి అడ్డుకునేందుకు స్థానికులు అక్కడే వేచి ఉన్నారు. చేసేది లేక దుకాణ యజమానులు గ్రామ సమీపంలో వేరే చోట షాపు ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



దుకాణం వద్ద గుమిగూడిన జనం

రూ.1.15 కోట్ల పల్లాడియం మెటల్ చోరీ

- కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులే తస్కరణ
- నలుగురు నిందితులు అరెస్టు
- విలువైన లోహం స్వాధీనం

అనకాపల్లి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సొంత ఇంటికే కన్నం పెట్టిన చందంగా... ఉద్యోగం చేస్తున్న కంపెనీలోనే విలువైన లోహాన్ని చోరీ చేశారు. దీని విలువ కోటి రూపాయలకుపైగా వుంటుంది. కంపెనీ యాజమాన్యం చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ దీపిక బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆమె చెప్పిన సమాచారం మేరకు...



విలేకరుల సమావేశంలో ఎస్పీ దీపిక. వెనుక నిందితులు

పరవాడ ఫార్మాసిటీలోని రవీంద్ర హెరాయిస్ ప్రైవేట్ కంపెనీలొ ఉత్ప్రేరకాన్ని రిసైకిలింగ్ చేసి పల్లాడియం మెటల్‌ను డ్రయ్యర్‌లో ఉంచి ఆర బెడతారన్నారు. ఇది అత్యంత ఖరీదైనది. కాగా ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన చింతకాయల రాజు పెయింటర్‌గా, చింతకాయల మురళి ప్రొడక్షన్ బ్లాక్‌లో హెల్పర్‌గా, అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కనుమూరి రామ చంద్రరాజు అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్‌గా, విజయనగరం జిల్లాకు చెందిన ముదునూరి వినీత్‌వర్మ ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అత్యంత విలువైన పల్లాడియం లోహాన్ని చోరీ చేసి డబ్బులు సంపాదించాలని భావించారు. ఈ నెల 5వ తేదీన లంకెలపాలెంలోని ఒక హోటల్లో వీరు సమావేశమై పల్లాడియం లోహం చోరీకి పథక రచన చేశారు. వినీత్‌వర్మ, రామ చంద్రరాజు అదే రోజు పరిశ్రమకు వెళ్లి సీసీ కెమెరాలను ఆపివేశారు. డ్రయ్యర్ లాక్‌కు సంబంధించి మారుతాళం చెవిని అప్పటికే తయారు చేయించి సిద్ధం చేసుకున్నారు. 9వ తేదీ రాత్రి చింతకాయల రాజు, చింతకాయల మురళి ప్లాంట్ గోడ దూకి లోపలికి వెళ్లారు. మారుతాళం చెవితో డ్రయ్యర్‌ను తెరిచి 4.11 కిలోల పల్లాడియం మెటల్‌ను చోరీ చేశారు. అనంతరం దీనిని చింతకాయల రాజు ఇంటి వద్ద భద్రపరిచారు. పదో తేదీ ఉదయం డ్రయ్యర్‌ను పరిశీలించిన కంపెనీ ప్రతినిధి వరదరాజన్.. 4.11 కేజీల పల్లాడియం మెటల్ లేనట్టు గుర్తించారు. దీని విలువ రూ.1.15 కోట్లు వుంటుందని అంచనా. లోహం చోరీకి గురైనట్టు నిర్ధారించుకుని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. వరదరాజన్ 12వ తేదీన పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంపెనీలో పనిచేస్తున్న అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టారు. చింతకాయల రాజు, చింతకాయల మురళి, కనుమూరి రామచంద్రరాజు ముదునూరి వినీత్‌వర్మలు కంపెనీలో చోరీ చేసిన పల్లాడియం మెటల్‌ను విక్రయించేందుకు బుధవారం పరవాడ మండలం తానాం శ్మశానవాటిక వద్ద వుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా పల్లాడియం మెటల్‌ను చోరీ చేసినట్టు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చోరీ కేసును నాలుగు రోజుల్లో చేదించడంలో కీలకంగా వ్యవహరించిన సిబ్బందికి ఎస్పీ దీపిక ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో పరవాడ డీఎస్పీ కె.సత్యనారాయణ, సీఐ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేడు మంత్రి లోకేశ్ రాక

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం రాత్రి నగరానికి రానున్నారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్ నుంచి రాత్రి పది గంటలకు విశాఖపట్నం చేరుకుని పార్టీ కార్యాలయంలో బస చేస్తారు. 17వ తేదీ ఉదయం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు జిల్లా కోర్టుకు వెళతారు. 'సాక్షి' పత్రికపై దాఖలు చేసిన పరువునష్టం కేసు వాయిదాకు హాజరవుతారు. అక్కడ నుంచి తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకుని రాత్రి బస చేస్తారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

విశాఖపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా సాగునీటి సంఘాల ఎన్నికలు తాత్కాలికంగా వాయిదా పడ్డాయి. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకు బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలచేయాలి. వచ్చే నెల 24వతేదీలోగా సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు పూర్తిచేయాలి. ఎన్నికల నిర్వహణకు జలవనరుశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండడంతో జిల్లా యంత్రాంగాలు వరద సహాయక చర్యలు, ఇతర కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. దీంతో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయవద్దని జలవనరులశాఖను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఉత్తరకోస్తా చీఫ్ ఇంజనీరు ఎస్.సుగణాకరరావు తెలిపారు.

గండి బాబ్జీ నుంచి మా స్థలాలను కాపాడండి

- బాధితుల డిమాండ్
- లేఅవుట్ వద్ద నిరసన

లంకెలపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ నుంచి తమ స్థలాలను కాపాడాలంటూ ఇ- మర్రిపాలెంలోని ఓ ప్రైవేటు లేఅవుట్ వద్ద బాధితులు బుధవారం ఆందోళన చేపట్టారు. బాబ్జీకి వ్యతిరేకంగా ప్లకార్డులు, బ్యానర్‌లను ప్రదర్శించి తమ స్థలాలను అప్పగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు సాంబశివరావు మాట్లాడుతూ 2012లో ఇ- మర్రిపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబర్లు 15, 16/1లో రెండు దఫాలుగా ఐదు ఎకరాల్లో కొనుగోలు చేసి లేఅవుట్ వేశామన్నారు. నాలా ఫీజులు చెల్లించి సుమారు 80 మందికి స్థలాలను అమ్మకాలు జరిపి రిజిస్ట్రేషన్ చేశామన్నారు. గత పది రోజుల క్రితం గండి బాబ్జీ అనుచరులు కొంత మంది తమ స్థలాల్లోకి చొరబడి రాతి గోడను ధ్వంసం చేసి ఫెన్సింగ్ వేసి కబ్జాకు ప్రయత్నించారని ఆరోపించారు. మధ్య తరగతి పేద కుటుంబాలకు చెందిన తాము ఇక్కడ స్థలాలను కొనుగోలు చేసుకున్నామన్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి స్థలాన్ని కబ్జా చేయడం తగదన్నారు. ఇదే విషయమై పరవాడ తహసీల్దార్‌తో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ప్రభుత్వం స్పందించి తమ స్థలాలను అప్పగించాలని కోరారు.

ప్రైవేటు మద్యం అమ్మకాలు ప్రారంభం

... 5వ పేజీ తరువాయి

దుకాణం నిర్వాహకులు చెబుతున్నారు. అనకాపల్లి పట్టణం జీవీఎంసీ పరిధిలో ఉండడంతో ఇక్కడ కేటాయించిన 12 షాపులను విశాఖ జిల్లా ఎక్సైజ్ అధికారులు లాటరీ పద్ధతిలో కేటాయించారు. దీంతో పట్టణంలో పలుచోట్ల ప్రైవేటు మద్యం దుకాణాలను నిర్వాహకులు తెరిచి అమ్మకాలు ప్రారంభించారు. అయితే బుధవారం సాయంత్రం వరకు పూర్తిస్థాయిలో ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు కాకపోవడంతో ముందుగా తెరిచిన దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. అంతేకాకుండా గత ప్రభుత్వంలో అమ్మకాలు సాగించిన ఊరూపేరు లేని బ్రాండ్ల మద్యం ఇప్పుడు ప్రైవేటు దుకాణాల్లో కనిపించలేదు. ఐదేళ్ల క్రితం వరకు అందుబాటులో వున్న ప్రముఖ లిక్కర్ కంపెనీల మద్యాన్ని తిరిగి అందుబాటులోకి వచ్చాయి. కంపెనీలనుబట్టి క్వార్టర్ మద్యం రూ.120 నుంచి రూ.200 వరకు వుంది. ఎంఆర్‌పీకే విక్రయిస్తున్నారని మందుబాబులు చెబుతున్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

సంఘ సమావేశానికి అధ్యక్షత వహించిన జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ పరిధిలో లబ్ధిదారులకు బిల్లులు ఇంతవరకు చెల్లించలేదని, దరఖాస్తు చేసిన వారికి కొత్త ఇళ్లు మంజూరుకాలేదని వెంటనే బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. పనులకు సంబంధించి గ్రామాల్లో సభలు నిర్వహించి తీర్మానాలు చేసే సందర్భంలో జడ్పీటీసీ సభ్యులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా చేపట్టే పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ జల జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొనగా సంబంధిత అధికారులు బదులిస్తూ త్వరలో మంజూరు చేస్తామన్నారు.

పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు మాట్లాడుతూ మండలంలోని తానాంలో జల వనరుల శాఖ చేపట్టాల్సిన పనులను గ్రామీణ నీటి సరఫరా విభాగం చేయడం వెనుక కొందరు అధికారుల ప్రమేయం ఉందని ఆరోపించారు. దీనిపై విచారణ చేయాలని కోరగా జల వనరుల శాఖ ఈఈ త్రినాథం బదులిస్తూ పనులపై ఇప్పటికే విచారణ పూర్తిచేశామన్నారు. డ్వామా పనులపై చర్చలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మాట్లాడుతూ రోడ్ల మరమ్మతులకు నిధులు వచ్చాయని, అయితే ప్రధాన రోడ్లకు ఇరువైపులా పొదలు తొలగించాలని కోరారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణపై సంబంధిత అధికారి మాట్లాడుతూ నిధులు మంజూరు చేస్తే పలు పథకాలు అందుబాటులోకి వస్తాయన్నారు. చాలాకాలం నుంచి నిధుల సమస్య కారణంగా పథకాల నిర్వహణ, పూర్తిచేయడంలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఇదిలావుండగా కోరం లేనందున నాలుగో స్థాయీ సంఘ సమావేశాన్ని వాయిదా వేశారు.